

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 12.12.2025 | సంపుటి : 2 | సంచిక :307 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 12.12.2025 | volume : 2 | Issue : 307 | Pages : 8 | Cost : 2/- |




04

## బంగారం, వెండి ధరల దూకుడు

2 లక్షలకు చేరువలో కిలో వెండి



06

## కృత్రిమమేధకు మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు

మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్యా నాదెళ్ల వెల్లడి



04

## నరసాపురం వరకు వందేభారత్ పొడిగింపు

15 నుంచి జనవరి 11 వరకు అమలు

# పంచాయతీలో కాంగ్రెస్ టాప్

మెజారిటీ పంచాయతీల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు

**84.28% పోలింగ్ నమోదు**

స్వల్ప ఉద్రిక్తతలు మినహా సాఫీగా సాగిన పంచాయతీ ఎన్నికలు

92.88%తో టాప్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా

అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 71.79% పోలింగ్




రాష్ట్రంలో తొలిదశలో గురువారం 3,835 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా, అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికిన అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. ఆ తర్వాత భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ మద్దతు పలికిన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో గెలుపొందారు. తర్వాత స్వతంత్ర అభ్యర్థులు ప్రధాన పార్టీల మద్దతు ఇచ్చిన అభ్యర్థులపై విజయం సాధించగా..మరి కొన్నిచోట్ల పార్టీ మద్దతు ఇవ్వకపోవడంతో రెబెల్ అభ్యర్థులుగా పోటీ చేసిన వారు విజయం సాధించారు.

### కాంగ్రెస్ విజయ దుందుభి

హైదరాబాద్: మొత్తం 4,236 పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వగా 396 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదు చోట్ల ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. దీనితో 3,835 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. గురువారం రాత్రి కడపటి సమాచారం అందేసరికి..ఏకగ్రీవంగా గెలుపొందిన వారితో కలిపి కాంగ్రెస్ మద్దతు పలికిన వారు 2,297 గ్రామాల్లో సర్పంచ్‌లుగా గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న

-మిగతా 2 లో..






# 17 నుండి 21 వరకు శీతాకాల విడిది

## రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు

### అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్ రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజులపాటు రాష్ట్రంలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని సి.ఎస్. ఆదేశించారు.

హైదరాబాద్, డిసెంబర్ 11 : కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోడ్డు భవనాల

-మిగతా 2 లో..

# మెస్సీ మ్యాచ్‌కు రండి

## కాంగ్రెస్ అగ్రనేతలతో సిఎం రేవంత్ భేటీ

### ఇటీవలి తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌పై వివరణ

### మెస్సీ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానం

న్యూఢిల్లీ, డిసెంబర్ 11 : 'మెస్సీ గోట్ ఇండియా టూర్' కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో మాట్లాడారు. ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు

-మిగతా 2 లో..



# వాణిజ్య సంబంధాలపై ట్రంప్‌తో చర్చ

## ఫోన్ కాల్‌లో మాట్లాడిన మోడీ, ట్రంప్



న్యూఢిల్లీ, డిసెంబర్ 11 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ఇరువురు నేతలూ చర్చించినట్టు తెలుస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత

-మిగతా 2 లో..



# కొండా సురేఖకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

హైదరాబాద్, డిసెంబర్ 11 : తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు నాంపల్లిలోని ప్రత్యేకకోర్టు గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై ఈ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీకి నాంపల్లి ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది.



# సిట్ ఎదుట లొంగిపోండి

## మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు సుప్రీం ఆదేశం

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన వెంటనే సిట్ ముందు లొంగిపోవాలని ఆదేశించింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పీఎస్‌లో సిట్ అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది.

న్యూఢిల్లీ, డిసెంబర్ 11 : కస్టోడియల్ దర్యాప్తునకు సిట్‌కు అనుమతిచ్చిన ధర్మాసనం.. ప్రభాకర్ రావుకు భౌతికంగా ఎలాంటి హాని లేకుండా చూడాలని స్పష్టం చేసింది. పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తూ విచారణకు సహకరించాలని

-మిగతా 2 లో..

# ఐ బొమ్మ రవి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్: సినీ పైరసీ కేసులో ప్రధాన నిందితుడు ఇమ్మడి రవికి బిగ్ షాక్ తగిలింది. బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి క్రిమినల్ కోర్టు గురువారం తిరస్కరించింది. పోలీస్ కస్టడీ కారణంగా రవి బెయిల్ పిటిషన్ విచారణ ఆలస్యమవుతూ వచ్చిన సంగతి తెలిసిందే. ఈలోపు..

-మిగతా 2 లో..




# తొలి విడుతలో 90శాతం మావే..



### కాంగ్రెస్ విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనం

### ప్రజల మద్దతు అనూహ్యంగా ఉంది

### కాంగ్రెస్ ఘన విజయంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హర్షం

రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన

-మిగతా 2 లో..



# కాంగ్రెస్ అగ్రనేతలతో సిఎం రేవంత్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

మెస్సీ హైదరాబాద్ వస్తున్నారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరు అవుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నా కాబట్టి నన్ను కూడా ఒక అతిథిగా పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ క్రీడాకారుడు వస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తున్నాం. దిల్లీలో కలిసిన అందరినీ ఈ కార్యక్రమానికి రావాలని పిలిచానని తెలిపారు. ఈనెల 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. మెస్సీ పర్యటన, ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ బిజీబిజీగా గడిపారు. ఉదయం పార్లమెంట్‌లో ఏఐసీసీ అధక్షులు మల్లికార్జునఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలు, గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అంశాలను వారి దృష్టి తీసుకెళ్లారు. గ్లోబల్ సమ్మిట్‌ను ఏ విధంగా విజయవంతం చేశామనే అంశాలపై చర్చించారు. దిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు ఎంపీలు వారితో భేటీ అయ్యారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై సోనియా, రాహుల్, ప్రియాంకలకు సీఎం రేవంత్ వివరించినట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమిట్, పెట్టుబడుల వివరాలను సోనియాకు ఆయన వివరించినట్లు తెలిసింది.

# ఐబొమ్మ కేసు..
## ఇమ్మడి రవికి బిగ్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

మూడో దఫా కస్టడీ విషయంలో సైబర్ క్రైమ్ పోలీసులు మరోసారి అప్పీల్‌కు వెళ్లడంతో ఆ విచారణ మరింత ఆలస్యం కావొచ్చని రవి ఆందోళన చెందాడు. అయితే.. ఆ అప్పీల్‌ను విచారిస్తూనే ఇటు రవి బెయిల్ పిటిషన్‌నూ కోర్టు పరిశీలించింది. చివరకు కేసుల తీవ్రత దృష్ట్యా రవి బెయిల్‌కు అనర్హుడని తేల్చేసింది. అదే సమయంలో.. కస్టడీపై రివిజన్ విచారణ చేపట్టిన కోర్టు రేపు తీర్పు వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ వైజాగ్‌వాసి అయిన ఇమ్మడి రవి.. ఐబొమ్మ, బప్పం అనే వెబ్‌సైట్లతో సినీ పైరసీకి పాల్పడ్డాడు. ఇటు పైరసీతో పాటు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసి కోట్లకు పడగలెత్తాడు. ఇందుకు కరేబియన్ దీవులను ఎంచుకుని అక్కడి నుంచి సర్వర్లు, థర్డ్ పార్టీ ద్వారా వ్యవహారం నడిపించాడు. మూడు విడతలుగా 8 రోజులపాటు జరిపిన విచారణలో రవి నుంచి పోలీసులు కీలక సమాచారాన్నే రాబట్టారు. సినిమాను బొమ్మగా పిలుస్తారు కాబట్టే ఐబొమ్మ అని పేరు పెట్టానని.. బలపం కాస్త బప్పం అయ్యిందని.. ఇలా ఆసక్తికర సంగతులను వెల్లడించాడు. అలాగే.. స్క్రీన్ రికార్డింగ్ ద్వారా ఓటీటీ కంటెంట్‌ను సైతం పైరసీ చేయగలిగానని తెలిపాడు. కస్టడీ విచారణలో సైబర్ పోలీసులకే రవి అత్యాధునిక టెక్నాలజీ పాఠాలను నేర్పించడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తించింది. అయితే కీలకమైన ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో రవి నుంచి సమాచారం రాబట్టాల్సి ఉంది. అందుకే పోలీసులు కస్టడీని ఎక్కువ రోజుల కోరుతున్నారు. సీసీఎస్ పోలీసుల కస్టడీ అప్పీల్ గనుక రిజెక్ట్ అయితే మూడు కేసులకుగానూ(ఒక కేసులో కస్టడీని కోర్టు కొట్టేసింది) మూడు రోజులపాటే రవిని పోలీసుల విచారించాల్సి ఉంటుంది.

# కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాం
### భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్ :** రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు ప్రతిపాదనను భారత రాష్ట్ర సమితి వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. రైతన్నలకు నష్టం కలిగించేలా, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న విత్తన బిల్లును వెంటనే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'ఈ విత్తన బిల్లు కార్యరూపం దాల్చితే ఎలాంటి ట్రయల్స్ లేకుండానే విదేశీ విత్తనాలు దేశంలోకి వచ్చే ప్రమాదముంది. విత్తనాల అంశంలో రాష్ట్రాల పాత్ర లేకుండా చేస్తున్న ఈ బిల్లును అందరూ వ్యతిరేకించాల్సిన అవసరముంది. ఈ బిల్లులో నకిలీ విత్తనాలను కట్టడి చేసే అంశంపై స్పష్టత లేదు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా విత్తనాల ధరలను నిర్ణయించే విధంగా ఈ బిల్లులో నిబంధనలున్నాయి. నకిలీ విత్తనాల తయారీలో కంపెనీలను బాధ్యులను చేయకుండా, కేవలం అమ్మకందారులు బాధ్యత వహించేలా చట్టాన్ని రూపొందించారు. రైతన్నల ప్రయోజనాలు, వ్యవసాయ సంక్షేమ అభివృద్ధికి ఉపయోగపడేలా బిల్లును తేవాలి. త్వరలోనే ఈ అంశంపై పార్టీ తరఫున రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్రానికి మరిన్ని సూచనలు ఇస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌దే పైచేయి

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల్లోని చాలా గ్రామ పంచాయతీల్లో ఆ పార్టీ మద్దతు పలికిన వారికే ఓటర్లు పట్టం కట్టినట్లు ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోంది. అయితే కొందరు కార్పొరేషన్ చైర్మన్ల (అధికార పార్టీ నేతలు) గ్రామాల్లో ప్రత్యర్థి పార్టీ మద్దతు పలికిన వారు విజయం సాధించినట్లు సమాచారం.

### సత్తా చాటిన బీఆర్ఎస్

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మద్దతు పలికిన అభ్యర్థులు కూడా గణనీయ సంఖ్యలో విజయం సాధించారు. గురువారం రాత్రి వరకు 1,156 సర్పంచ్ స్థానాల్లో గులాబీ పార్టీ గెలుపొందింది. స్వతంత్రులు 524 చోట్ల విజయం సాధించగా, బీజేపీ 186 స్థానాల్లో, వామపక్షాలు 25 స్థానాల్లో గెలుపొందాయి. మిగతా చోట్ల ఫలితాలను ప్రకటించాల్సి ఉంది.

### చనిపోయినా సర్పంచ్‌గా గెలుపు

ఈ ఎన్నికల్లో 95 సంవత్సరాల వృద్ధుడు సర్పంచ్‌గా ఎన్నికవగా.. మరోచోట ఎన్నికల బరిలో ఉండగా గుండెపోటుతో మరణించిన అభ్యర్థి విజయం సాధించడం గమనార్హం. ఇంకొన్ని చోట్ల తల్లిపై కూతురు, అత్తపై కోడలు విజయం సాధించిన ఉదంతాలు వెలుగు చూశాయి. ఈ నెల 14న రెండో విడత, 17న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో 3,835 సర్పంచ్ స్థానాలతో పాటు 27,628 గ్రామ పంచాయతీ వార్డులకు ఎన్నికలు జరిగాయి.

# 84.28% పోలింగ్ నమోదు

**హైదరాబాద్, డిసెంబర్11 :** తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. 84.28 శాతం ఓటింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ప్రకటించింది. మొదటి దశకు మొత్తం 53,57,277 మంది ఓటర్లు ఉండగా, వారిలో 45,15,141 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. మహిళా ఓటర్లు 84.40%, పురుష ఓటర్లు 84.16%, ఇతరులు 41.27% ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.88%, అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 71.79% ఓటింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం 1 గంటకు పోలింగ్ పూర్తి కాగానే ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యింది. కౌంటింగ్ పూర్తయ్యాక గెలిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రకటించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ ప్రక్రియ ముగిశాక ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించారు. అక్కడక్కడ స్వల్ప ఉద్రిక్తతలు, చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ సాఫీగా సాగినట్టుగా ఎస్ఈసీకి నివేదికలు అందాయి.

### ఉదయం నుంచే బారులు

ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం పోలింగ్ మొదలు పెట్టడానికి గంట ముందు మాక్ పోలింగ్ నిర్వహించి గ్రీన్‌పేపర్‌తో బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేశారు. ఉదయం 9 గంటలకు 21.07%, 11 గంటలకు 53.04%, పోలింగ్ ముగిసే ఒంటిగంట సమయానికి 79.17% పోలింగ్ జరిగింది. అయితే అప్పటికే పోలింగ్ బూత్‌లలో క్యూలైన్లలో ఉన్నవారు కూడా ఓట్లు వేశారు. మొత్తంగా పోలింగ్ ప్రక్రియ ముగిసేసరికి 84.28% పోలింగ్ నమోదైనట్టు ఎస్ఈసీ వెల్లడించింది. కాగా ఓటింగ్ సరళిని ఎస్ఈసీ కార్యాలయం నుంచి లైవ్ లో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల కమిషనర్ ఐ.రాణీ కుముదిని పర్యవేక్షించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్ఈసీ కార్యదర్శి మంద మకరందు కూడా పోలింగ్ పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియ పర్యవేక్షణతో పాటు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి సమాచారం అందేలా ఎస్ఈసీ ఏర్పాట్లు చేసింది.

### అర్థరాత్రి దాటినా కౌంటింగ్

ఓటింగ్ శాతం భారీగా నమోదుతో పాటు క్యూలైన్లలో ఉన్న ఓటర్లు ఓటు వేసేందుకు సమయం పట్టడంతో.. మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు ఎక్కువ ఓట్లు ఉన్న చోట్ల కౌంటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. దీంతో అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొన్ని పంచాయతీల్లో కౌంటింగ్ కొనసాగింది.

# 17 నుండి 21 వరకు రాష్ట్రపతి పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

శాఖ విభాగం అవసరమైన బారికేడింగ్‌లు, ఇతర ఏర్పాట్లు చేయాలని, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో వుంచాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని, అదేవిధంగా తేనెటీగలను పట్టుకోవానికి ముందుస్తు ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ



సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డిజిపిలు మహేష్ భగవత్, ఉఊఓఅ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అఠ. ప్రియాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# ట్రంప్‌కు ప్రధాని మోడీ ఫోన్

(మొదటిపేజీ తరువాయి)

పర్యటన తర్వాత.. ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయడంపై సర్వత్రా ఆసక్తి రేపుతోంది. భారత్–అమెరికాల మధ్య వాణిజ్య సంబంధాలు, ప్రపంచ పరిణామాలపై ట్రంప్‌తో మోదీ మాట్లాడినట్టు సమాచారం. అలాగే ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంపై కూడా ఇరు నేతలూ చర్చించినట్టు తెలుస్తోంది. వ్యాపారం, సాంకేతికత, రక్షణ, భద్రత రంగాల్లో సహకారంపై సంభాషణ జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే.. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన ముగిసిన రోజుల వ్యవధిలోనే మోదీ ట్రంప్‌తో ఫోన్ చేసి మాట్లాడటంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

## పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో
# సమగ్ర నీటి నిర్వహణ

- అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్ నిర్మాణం
- గవర్నర్ కార్యాలయం, రెండు గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్లకు అనుమతి
- 4 అంశాలపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చ
- క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల పెట్టుబడులు
- 3057 మందికి క్వాంటం అప్లికేషన్స్‌లో శిక్షణ
- కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి, డిసెంబర్ 11 :** పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించి దాదాపు రూ.9,500 కోట్లతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, రెండు గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి మంత్రివర్గం అంగీకారం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన మంత్రివర్గ సమావేశంలో 44 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. సమావేశం ముగిసిన తర్వాత కేబినెట్ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. 44 అంశాలపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి తెలిపారు. అమృత్ 2 లో భాగంగా 2026 మార్చి 31 కల్లా పెండింగ్ పనులు ప్రారంభించాలని కేంద్రం స్పష్టం చేసిందని.. అమృత్ 2లో భాగంగా 506 పెండింగ్ ప్రాజెక్టులను రూ.9,613 కోట్ల నిధులతో చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. రూ.163 కోట్లతో అమరావతిలో లోక్ భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. ఎల్ 1 బిడ్లను ఆమోదించే బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమరావతిలో ఇ 3 రోడ్డు విస్తరణకు ఎల్ 1 బిడ్ ఆమోదానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎండీకి బాధ్యతలు అప్పగించామన్నారు. సీడ్ యాక్సిస్ రహదారిని 16వ జాతీయ రహదారికి అనుసంధానించే పనులకు రూ.532కోట్ల మేర టెండర్లు పిలిచేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. కుప్పంలో పాలేరు నదిపై చెక్ డ్యాంల నిర్వహణకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ ముసాయిదా బిల్లుపై కేబినెట్‌లో చర్చించారు. ఎస్ఐపీబీలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రపెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో 26సంస్థల ఏర్పాటుకు సంబంధించి ఆమోదం తెలిపిన దాదాపు రూ.20,444 కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. వీటి ద్వారా 56వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగనుందని మంత్రి పార్థసారథి తెలిపారు.చిత్తూరు జిల్లా కుప్పంలో పలార్ నదిపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.15.96 కోట్ల నిధులను పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించిందన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 417 టీచర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సాంఘిక సంక్షేమం విభాగంలో సామాజిక సేవలో అనుభవం ఉన్న వ్యక్తులను చైర్మన్లు, మెంబర్లుగా నియమించే ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పిందన్నారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా కీలక ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 3057 మందికి క్వాంటం అప్లికేషన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం చెప్పిందని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన 11 సంస్థల ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని మంత్రి పార్థసారథి తెలిపారు. క్వాంటం కంప్యూటర్లు తయారు చేయడం కోసం ముందుకు వచ్చిన పలు సంస్థల ప్రతిపాదనలకు, అలాగే క్వాంటం కంప్యూటింగ్ లో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. ఇటీవల ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న పలు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సంస్థలకు సంబంధించి 20267 కోట్ల రూపాయల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచడాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. విద్యుత్ చార్జీలను రూ. 5.12 నుంచి 4 రూపాయలకు తీసుకురావాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. దీని కోసం రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పలు సంస్థల ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించిందన్నారు. కృష్ణపట్నం పోర్టులో 4731 ఎకరాలు మల్టీ ప్రొడక్ట్ సెజ్ ఏర్పాటు కోసం 2010లో ల్యాండ్ కొనుక్కున్నారని.. అక్టోబర్ 2019లో గత ప్రభుత్వం ఈ భూ కేటాయింపులను రద్దు చేసిందన్నారు. దీన్ని కోర్టు కొట్టి వేయడం వల్ల ప్రాజెక్టు పదేళ్లు ఆలస్యమైనందున పెనాల్టీని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. 3 ఏళ్లలో తొలిదశ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభిం చాలని సమయం ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మహిళల ప్రపంచ కప్ గెలుపులో విశేష ప్రతిభ చూపిన రాష్ట్ర క్రీడాకారిణి శ్రీ చరణికి ప్రోత్సాహకం ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు, విశాఖపట్నంలో 500 గజాలు ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్థసారథి చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. పీఎం సూర్యఘర్ కింద ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు అదనంగా సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల అదనపు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం కలిన బీసీ వినియోగదారులకు రూ.20 వేల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రూ.5445 కోట్ల అంచనా బడ్జెట్‌తో పీఎం సూర్యఘర్ ప్రాజెక్టును రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.



# నాన్ బెయిలబుల్ వారంటే అబద్ధం : కొండా సురేఖ

**హైదరాబాద్, డిసెంబర్11 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయినట్లు తనపై జరుగుతున్న ప్రచారంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. కొన్ని పత్రికలు, ఛానళ్లు, వెబ్ సైట్లలో తనకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం అని ఆమె గురువారం హదరాబాద్‌లో స్పష్టం చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ.. ఫిబ్రవరి 5వ తేదీన ఉందన్నారు. ఆ రోజు జరిగే విచారణకు హాజరుకావాలని కోర్టు తనకు స్పష్టం చేసిందన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.

# తొలి విడతలో 90శాతం పైగా కాంగ్రెస్ సర్పంచ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందన్నారు. మొదటి విడత ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలుపొందడం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

# గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి సందర్శకులు

## రెండోరోజున పెద్దఎత్తున తరలిరాక



**హైదరాబాద్, డిసెంబర్ 11 :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను గురువారం కూడా పెద్ద ఎత్తున సాధారణ ప్రజలు, విద్యార్థులు సందర్శించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో ఈ స్టాళ్లను దర్శించడానికి బారులు తీరారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమాలు 'డిస్కవర్ తెలంగాణ: కల్చరల్ హెరిటేజ్ అండ్ నెక్స్ట్ జెన్ టూరిజం' అనే అద్భుతమైన సదస్సుతో ప్రారంభమైంది. వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ చరిత్ర, మ్యూజియం సంస్కృతి, పర్యాటక అభివృద్ధి, ఆహార సంస్కృతి తదితర విభిన్న కోణాల్లో విలువైన విశ్లేషణలను ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు వివరించారు. తెలంగాణను ప్రపంచ స్థాయిలో ఒక సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను వీరు వివరించారు. ఈ సదస్సులో డా. మామిడి హరి కృష్ణ, బిరద్ రాజారామ్, పి. పద్మావతి, గోపీ బైల్లుప్పాల లు పాల్గొని మాట్లాడారు. అనంతరం, తెలంగాణ రైజింగ్–ఎంపవరింగ్ ఆల్, గ్రోవింగ్ టుగెదర్ అనే సదస్సులో ప్రముఖులు విద్యార్థులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా చేపట్టిన ప్రగతిని మరియు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై క్లుప్తంగా వివరించారు ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పెస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి,చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ ఛేదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సు ను సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.



## ప్రజాసేవకు అంకితమైన ప్రణబ్ ముఖర్జీ

### జయంతి సందర్భంగా సీఎం రేవంత్ నివాళి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ.. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా.. ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

## హెచ్-1 వీసా ఇంటర్వ్యూల వాయిదాతో గందరగోళం

### ఇండియాకు వెళ్లొద్దని లాయర్ల సూచన




**వాషింగ్టన్, డిసెంబర్ 11 :** భారత్‌లో డిసెంబర్‌లో జరగాల్సిన వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాదికి అమెరికా వాయిదా వేసిన క్రమంలో ఎవ్వరు కూడా ఇప్పుడు ఇండియాకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఇంటర్వ్యూలు ఉండొచ్చంటూ ఇటీవల అకస్మాత్తుగా లబ్ధిదారులకు సందేశాలు పంపించింది. దీంతో, ఒక్కసారిగా కలకలం రేగింది. లబ్దిదారుల సోషల్ మీడియా అకౌంట్స్ పరిశీలన నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. దీంతో, అమెరికాలోని హెచ్–1బీ వీసాదారులకు అక్కడి ఇమిగ్రేషన్ లాయర్లు కీలక సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీసా స్టాంపింగ్ కోసం భారత్‌కు వెళ్లడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు హెచ్–1బీ వీసా కాలపరిమితి ఇంకా ముగియని వారు మాత్రమే తమ సొంత దేశాలకు వెళ్లి రావొచ్చని ఇమిగ్రేషన్ లాయర్స్ చెబుతున్నారు. హెచ్–1బీ వీసాదారులు తిరిగి అమెరికా వెళ్లాలంటే తమ సొంత దేశాల్లోని యూఎస్ కాన్సులార్ కార్యాలయాల ఆమోదముద్ర తప్పనిసరి. కాబట్టి ఇంటర్వ్యూలు వాయిదా పడిన ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్–1బీ హోల్డర్స్ తమ సొంత దేశాల్లోనే ఉండిపోవాల్సి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. చివరకు అమెరికా జాబ్‌లో పోగొట్టుకునే అవకాశం ఉందని కూడా అన్నారు.

## ఆర్టీఐ కింద సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం

### ఇద్దరు ఐఏఎస్‌లకు నోటీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 11 :** ఆర్టీఐ చట్టం కింద సమాచారం ఇవ్వలేదంటూ దాఖలైన పిటిషన్‌పై ఇద్దరు ఐఏఎస్‌లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు ఉన్నా ఆర్టీఐ చట్టం కింద సమాచారం అందజేయ లేదని మాజీ జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి, ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆర్టీఐ చట్టం ప్రకారం పిటిషనర్ అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో గతంలో సికింద్రాబాద్‌లోని రాంగోపాల్‌పేటకు చెందిన వడ్డం శ్యామ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం వెంటనే అడిగిన సమాచారం ఇవ్వాలని నవంబర్ 24న ఆదేశాలు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని శ్యామ్ మరోసారి కోర్ట్‌ను ఆశ్రయించారు. గురువారం విచారణ జరిపిన ధర్మాసనం.. ఐఏఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోవద్దో తెలపాలని ఐఏఎస్ అధికారులపై మండిపడింది. కోర్టు ఆదేశాలు ఎందుకు పాటించలేదో వివరిస్తూ జనవరి 26న కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా కోర్ట్ ఉత్తర్వులు పాటించకపోతే జరిమానా విధిస్తామని ఇద్దరు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ధర్మాసనం హెచ్చరికలు జారీ చేసింది.

## కబ్జా చేసినట్లు రుజువు చేస్తే జైలుకెళ్తా

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**హైదరాబాద్, డిసెంబర్ 11 :** తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడ లేదని.. తానేంటో ప్రజలకు తెలుసునని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. తాను కబ్జాలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐడీపీఎల్ భూముల కబ్జాపై తనపై ఇద్దరు నేతలు అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆ భూముల్లో నివాసం ఉంటున్న పేదల జోలికి వెళ్తే ఆత్మాహుతి చేసుకుంటానని ఆయన హెచ్చరించారు. ఆ భూముల్లో తాను గజం జాగా కబ్జా చేశానని నిరూపిస్తే.. తాను జైలుకెళ్లేందుకు సిద్ధమని చెప్పారు. రూ. 4 వేల కోట్ల విలువైన భూ వివాదంపై లోతుగా దర్యాప్తు చేయాలని ఈ సందర్భం గా ఎమ్మెల్యే కోరారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా పాల్ప డుతున్నారని తాను గతంలోనే చాలాసార్లు ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అక్కడ స్థానికంగా ఉంటున్న ఇంద్రనగర్ 70 ఏళ్ల క్రితం ఏర్పడిందని తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజల కోసం డ్రైనేజీ, రహదారుల సౌకర్యం కల్పించాలంటూ జీహెచ్ఎంసీ నుంచి గతంలో నిధులు తీసుకొచ్చానని వివరించారు. అయితే ఐడిపిఎల్ ఉద్యోగులను తాను బెదిరించాననేది పూర్తిగా అవాస్తవమని ప్రకటించారు. ఈ ఆరోపణలను తాను పూర్తిగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాధవరం కృష్ణారావుపై ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బుధవారం ఎమ్మెల్యే కృష్ణారావు కాస్త ఘాటుగా స్పందించారు. దాంతో ఎమ్మెల్యే కృష్ణారావుపై జాగృతి నేతలతోపాటు అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఆధారాలతో సహా అన్ని విషయాలు బయటపెడతానంటూ కవిత స్పష్టం చేశారు.

## సర్పంచ్ ఎన్నికను బహిష్కరించిన గ్రామస్తులు

**కామారెడ్డి, డిసెంబర్ 11 :** తెలంగాణలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలవగా.. మధ్యాహ్నం 1 గంటల వరకు ముగిసాయి. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే పోలింగ్ నేపథ్యంలో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొనగా కామారెడ్డిలోని ఓ గ్రామంలో మాత్రం ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. దీంతో ఆ గ్రామంలో సర్పంచ్ ఎన్నికకు బ్రేక్ పడినట్లైంది. జిల్లాలోని రామారెడ్డి మండలం చిన్న గోకుల్ తండా వాసులు ఎన్నికలను బహిష్కరించారు. తమకు సమాచారం ఇవ్వకుండా పెద్ద గోకుల్ తండా వాసులు సర్పంచ్‌ను ఏకగ్రీవం చేసుకున్నారని గ్రామస్తులు నిరసనకు దిగారు. పెద్ద గోకుల్ తండా వాసిని వేలం పాట ద్వారా ఏకగ్రీవం చేసుకున్నారని చిన్న గోకుల్ తండా వాసులు ఆరోపిస్తున్నారు. ఇందుకు నిరసనగా చిన్న గోకుల్ తండా వాసులు ఓట్లు వేయకుండా తండాల్లోనే ఉండిపోయారు. తమకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరి చిన్న గోకుల్ తండా వాసుల డిమాండ్ పట్ల అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



## జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో అగ్నిప్రమాదం

### మంటల్లో మూడు కార్లు.. ఒక ఆటో దగ్ధం

**హైదరాబాద్, డిసెంబర్ 11 :** జూబ్లీహిల్స్ రహమత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ మంటల్లో మూడు కార్లు, ఒక ఆటో దగ్ధమయ్యాయి. వీటితో పాటు సమీపంలో పార్కింగ్ చేసిన వాహనాలకు మంటలు అంటుకున్నాయి. అగ్నిప్రమాదం ధాటికి మంటలు ఎగసి పడ్డాయి. స్థానికులు ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. సమాచారం అందగానే సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మరోవైపు పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులను సంఘటనా స్థలం నుంచి దూరంగా పంపించివేసారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై దగ్గరలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. గంజాయి మత్తులో ఓ వ్యక్తి చెత్తకు నిప్పు అంటించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని ఇళ్ల వారు ఈ గ్రౌండ్‌లో కార్లు పార్కింగ్ చేస్తుంటారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? దురుద్దేశంతో చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఘటనా స్థలాన్ని ఎస్ఆర్ నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, బోరబండ ఇన్‌స్పెక్టర్ సురేందర్ పరిశీలించారు.

## ఫైబర్ నెట్ కేసులో ప్రొటెస్ట్ పిటిషన్ తిరస్కరణ

**అమరావతి, డిసెంబర్ 11 :** ఏపీ ఫైబర్‌నెట్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా దాఖలైన గౌతమ్ రెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్ ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఈ కేసుపై తాజాగా విచారణ జరిపింది ఏసీబీ న్యాయ స్థానం. ఇప్పటికే నెట్ కేసును సీఐడీ క్లోజ్ చేసిందని పేర్కొంటూ.. ప్రొటెస్ట్ పిటిషన్‌ను రిజెక్ట్ చేసింది.

## తొలి విడతలో 90శాతం పైగా కాంగ్రెస్ సర్పంచ్‌లు

- ప్రజల మద్దతు అనూహ్యంగా ఉంది
- కాంగ్రెస్ ఘన విజయంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హర్షం



**హైదరాబాద్, డిసెంబర్ 11 :** రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజాప్రభుత్వం పట్ల ప్రజలు మరోమారు విశ్వాసం ప్రకటించారని అన్నారు. ఇది తమకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందని అన్నారు. ఇందుకు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదా రులైన అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందన్నారు. మొదటి విడత ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలుపొందడం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నా యని టీపీసీసీ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో అభిప్రాయ పడ్డారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, పార్టీ తరఫున ఎన్నికల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. నిరంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకుల ను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేసిన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం– అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేశ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగేందుకు కారణమైందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతం అని వ్యాఖ్యానించారు. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని.. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

## షాద్‌నగర్‌లో టాస్ గెలిచిన సర్పంచ్

**షాద్‌నగర్, డిసెంబర్ 11 :** తెలంగాణలో హోరాహోరీగా జరిగిన తొలిదశ పంచాయితీ ఎన్నికల్లో అరుదైన ఘటనలు చోటు చేసుకున్నాయి. పలుచోట్ల ఒకటి రెండు ఓట్లతో గెలవడం, టాస్‌తో గెలవడం వంటి విచిత్రాలు జరిగాయి. . పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో టాస్ వేసి సర్పంచ్ ఎవరన్నది డిసైడ్ చేయాల్సి వచింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందూరు మండలం చిన్న ఎలికిచర్ల చిన్న ఎలికిచర్ల గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు పోల్ అవ్వడంతో టాస్ వేసి సర్పంచ్ ను నిర్ణయించారు ఎన్నికల అధికారులు. ఎలికిచర్ల గ్రామపంచాయితీ బరిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మరాఠి రాజు, అదే పార్టీకి చెందిన మరో అభ్యర్థి మరాఠి రాము పోటీ చేశారు. ఇద్దరికీ 212 ఓట్లు వచ్చాయి. ఓట్లు సమానం రావడంతో అధికారులు రికౌంటింగ్ జరిపారు. ఓట్లు మళ్లీ సమానంగా ఉండడంతో ఈసారి అధికారులు టాస్ వేశారు. టాస్ ఎవరిని వరిస్తుందోనని ఇద్దరు అభ్యర్థులతో పాటు మొత్తం గ్రామం వేచి చూసింది. నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన ఈ ఎపిసోడ్ లో చివరకు టాస్ మరాఠీ రాజును వరించడంతో సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించారు

## తెలంగాణలో అఖండ టిక్కెట్ ధరల పెంపు

### ప్రభుత్వ జీవోను తిరస్కరించిన హైకోర్టు




**హైదరాబాద్, డిసెంబర్ 11 :** నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ 2: తాండవం' మూవీ రిలీజ్ డేట్ ఏ మూహూర్తంలో ప్రకటించారో కానీ.. వంసగా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా ఈ మూవీకి హైకోర్టు మరో షాక్ ఇచ్చింది. మరికొన్ని గంటల్లో మూవీ రిలీజ్ కావాల్సి ఉండగా.. ప్రీమియం షోకు ధరల పెంపుపై ప్రభుత్వ జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. అంతే కాదు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు, సినీ నిర్మాణ సంస్థకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నేటికి వాయిదా వేసింది. ఇటీవల రేవంత్ సర్కార్ స్పెషల్ షోతో పాటు టికెట్ల ధరలు పెంచుతూ జారీ చేసిన జీవోను కోర్టు రద్దు చేసింది. అఖండ –2 మూవీకి డిసెంబర్ 12 నుంచి 14 వ తేదీ వరకు టికెట్ ధరలు పెంచుకోవచ్చునని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులు ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్లో టికెట్ పై రూ.50, మల్టీప్లెక్స్‌లో రూ.100 అదనంగా వసూలు చేసుకోవచ్చునని స్పష్టం చేసింది. అలాగే డిసెంబర్ 11వ తేదీన ప్రీమియర్ షో టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించేందుకు సర్కార్ అంగీకరించింది. కాకపోతే టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాల్సిందిగా మూవీ మేకర్స్‌కి షరతు విధించింది. ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలంటూ హైకోర్టును అడ్వకేట్ ఆశ్రయించడం.. ఈ పిటిషన్‌పై విచారణ జరగడం ఆసక్తిగా మారింది. వాస్తవానికి ఈ మూవీ డిసెంబర్ 5వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. అయితే.. ఈ మూవీపై స్టే విధిస్తూ తీర్పు ఇచ్చింది చెన్నై హై కోర్టు. ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థ తమకు 14 రీల్స్ సంస్థ నుంచి నగదు రావాల్సి ఉందని.. అది క్లీయర్ అయ్యే వరకు ఈ చిత్రం విడుదలను అడ్డుకుంటామని పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సుధీర్ఘ విచారణ తర్వాత ఈరోస్ మూవీ రిలీజ్‌కు అనుమతి ఇచ్చింది. మొత్తానికి ఈ చిత్రం రేపు.. అంటే శుక్రవారం భారీ అంచనాలతో విడుదల కానుంది. దీంతో మూవీ మేకర్స్‌కు మరో ఎదురు దెబ్బ తగిలినట్లు అయింది.

## నితిన్ గడ్కరీతో కామారెడ్డి ఎమ్మెల్యే భేటీ

### కామారెడ్డి పట్టణంలో ఔటర్ రింగ్ రోడ్డు కోసం వినతి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** కామారెడ్డిలో అభివృద్ధి పనులు లక్ష్యంగా ఢిల్లీ వెళ్లిన స్థానిక బిజెపిఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి వరుసగా కేంద్రమంత్రులను కలుస్తున్నారు. బుధవారం అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ఎమ్మెల్యే గురువారం నితిన్ గడ్కరీని కలిశారు. కామారెడ్డి పట్టణంలో ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు నియోజకవర్గంలోని రహదారుల విస్తరణకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రానికి నలువైపులా 54 కిలో మీటర్ల మేర పొడవైన రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. లింగాపూర్ స్టేజీ నుంచి వైద్య కళాశాల, మైనార్టీ గురుకుల కళాశాల మీదుగా జాతీయ రహదారి వరకు నాలుగు వరుసల రోడ్ల విస్తరణకు రూ.40 కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. భిక్కనూరు మండల కేంద్రం నుంచి తిప్పాపూర్, తలమడ్ల మీదుగా రాజంపేట వరకు రెండు వరుసల రోడ్డుకు రూ.18 కోట్లు మంజూరు చేయాలన్నారు. కామారెడ్డి పట్టణంలో పాత బస్టాండు నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ నిమిత్తం రూ.8 కోట్ల నిధులు అవసరమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పాల్వంచమర్రి నుంచి మాందాపూర్ మీదుగా భిక్కనూరు వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు రూ.24 కోట్లు విడుదల చేయాలని కోరారు.

## ఒక్క ఓటుతో గెలిచిన మహిళ

**ఆదిలాబాద్, డిసెంబర్ 11 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఒక్క ఓటతో 'ఆమె'ను గెలుపు వరించింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని వివాదాస్పద గ్రామమైన పరందొలి గ్రామ పంచాయతీ సర్పంచిగా రాథోడ్ పుష్పలత కేవలం ఒక్క ఓటుతో ప్రత్యర్థి దీలిప్ కాటేపై గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి వెంకటస్వామి ప్రకటించారు. ఈ గ్రామ పంచాయతీలో మొత్తం 873 ఓటర్లు ఉన్నారు. ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. కాటే దీలిప్‌కు 101 ఓట్లు రాగా, పుష్పలతకు 102 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఒక్క ఓటు తేడాతో ఆమెకు విజయం దక్కింది. పంచాయతీ అభివృద్ధికి తాను కృషి చేస్తామని పుష్పలత పేర్కొన్నారు.

# ఎన్నికల సంస్కరణలపై చిత్తశుద్ధిలేని చర్చ!




**పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ కాస్తా అసలు విషయాలను పక్కదారి పట్టించేలా ఉంది. అధికార బిజెపి లేదా ఎన్‌డిఎ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. ఇంటాబయటా ఆయన అదే పాట పాడుతున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు.**

ఎన్నికల సంస్కరణలపై చర్చ అంటూ తమ అనుకూలంగా లేని విషయాలపై పార్లమెంటులో చర్చిస్తున్నారు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. దీనికోసమే అందరి ఆరాటంగా ఉంది. ఇందులో ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలుగా మారుతున్నారు. అసలు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల కు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే అవకాశం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్దత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై రాజీవ్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, లెఫ్ట్ పార్టీలు ఎందుకు అభ్యంతరం చెబుతున్నాయో చెప్పాలి. నిజమైన ఓటర్లే జాబితాలో ఉండాలనే దానిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో జాతికి తెలియ చేయాలి.

ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని చెబుతున్న మాటల్లో కూడా నిజం లేదు. ప్రజలు తక్కువ అంచనా వేయడం సరికాదు. ఓటుహక్కు నిరాకరణకు గురైనవారిలో ఎవరున్నా వారి పేర్లు బయటపెట్టి చూపగలగాలి. అలా చేయకుండా సర్ ప్రక్రియను వ్యతిరేకించడం సరికాదు. పార్లమెంటులో 'ఎన్నికల సంస్కరణల'పై చర్చ తలాతోకా లేకుండా సాగింది. ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరి యన్లంతా చర్చించాలి. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి విజేత అవుతాడు. అలాంటి సమయంలో దొంగ ఓటర్లంతా ఓటేస్తే..తద్వారా ఎన్నికైన వారంతా ప్రజా ప్రతినిధులు ఎలా అవుతార్నదే ప్రశ్న. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ ప్రధానంగా చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. నిజానికి ఎన్నికల 'సంస్కరణల' గురించి కాకుండా ప్రస్తుత పాలకులు, విపక్షాలు కలసి తమకు అనుకూలంగా ఉండే విషయాలనే ప్రస్తావిస్తున్నారు. దానిపైనే చర్చిస్తున్నారు. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ఎన్నికలలో అక్రమాలు భారత్‌కే పరిమితం కాలేదు.

ఎన్నికల నిర్వహణ అమలు చేస్తున్న అన్ని దేశాల్లో ఈ జాడ్యం ఉంది. ఉన్న నియమాలను నిరంకుశ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకోవడమనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నది. నియంతలు తమ ఇష్టారాజ్యంగా ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూనే వస్తున్నారు. తమకు ప్రజల మద్దతు పూర్తిగా ఉన్నదని చూపడానికి దొంగ ఓట్లతో సాయం పొందుతున్నారు. రాజ్యాంగ సంస్థను తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. ఎన్నికల నియమాలు పూర్తిగా తమకు అనుకూలంగా ఉండేలా చేస్తున్నారు. అందువల్ల మొదట నియమ నిబంధనలు మార్చాల్సి ఉంది. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది. జాస్వామ్య వ్యవస్థను క్రమంగా నిరంకుశత్వం వైపు మళ్లించకుండా అడ్డుకోగలుగుతాం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నాయకులకు కాల పరిమితి ఉంటే అవినీతికి అంతగా ఆస్కారం ఉండదు. అందువల్ల ఎన్నికల సంస్కరణల ఆవశ్యకతను గుర్తించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయాలి. అంతేగాకుండా ఓటు వేయమన్నది బాధ్యత కూడా కావాలి. కావాలని ఓటేయని వారినిశిక్షించే పరిస్థితి కూడా ఉండాలి. ఇవన్నీ సాధ్యమైతేనే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడగలదు.

# ముగిసిన తొలివిడత పంచాయతీ పోలింగ్

## భారీగా తరలి వచ్చి ఓటేసిన గ్రామీణం

**హైదరాబాద్, డిసెంబర్ 11 :** రాష్ట్రవ్యాప్తంగా తొలి విడుత ఎన్నికల పోలింగ్ ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్.. మధ్యాహ్నం ఒంటిగంటతో పూర్తయ్యింది. పలుచోట్ల ఒంటిగంట వరకు క్యూలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. రాత్రి వరకు పోలింగ్ ఫలితాలు ప్రకటించి.. ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. చెదు-రుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారు. తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్ఈసీ కమిషనర్ పేర్కొన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు.



వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను.. 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇకపోతే పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూన్లలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోటీ చేస్తుండగా.. 12, 960 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే, ఒక గ్రామ పంచాయతీ, పది వార్డుల్లో ఎన్నికలను నిలిపివేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. 56,19,430 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 27,41,070, మహిళలు 28,78,159, ఇతరులు 201 మంది ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్ఈసీ కమిషనర్ పేర్కొన్నారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారుల ను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు చెప్పారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నట్లు చెప్పారు. 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగించిట్టు చెప్పారు.

# నరసాపురం వరకు వందేభారత్ పొడిగింపు

## 15 నుంచి జనవరి 11 వరకు అమలు

**చెన్నై, డిసెంబర్ 11 :** చెన్నై సెంట్రల్-విజయవాడ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు తాత్కాలికంగా పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.20677 చెన్నై సెంట్రల్-నరసాపురం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి జనవరి 11వ తేది వరకు చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి 7.05 గంటలకు రేణిగుంట, 8.29 గంటలకు నెల్లూరు, 9.43 గంటలకు ఒంగోలు, 11.08 గంటలకు విజయవాడ(÷ఎతితీజాజీలిజీటజీ), మధ్యాహ్నం 12.29 గుడివాడ, 1.14 గంటలకు భీమవరం టౌన్, 2.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.20678 నరసాపురం-చెన్నై సెంట్రల్ వందే భారత్ ఈ నెల 17 నుంచి జనవరి 11వ తేది వరకు నరసాపురం(ఔజీసజీబజూబీసజీప)లో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి 3.19 గంటలకు భీమవరం టౌన్, సాయంత్రం 4.04 గంటలకు గుడివాడ, 4.50 గంటలకు విజయవాడ, 6.29 గంటలకు ఒంగోలు, రాత్రి 7.39 గంటలకు నెల్లూరు, 9.50 గంటలకు రేణిగుంట, 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.



# భవానీ భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిట

## దీక్షల విరమణకు భారీగా చేసుకున్న భక్తులు





**విజయవాడ, డిసెంబర్ 11 :** విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం భవానీ భక్తులతో కిటకిటలాడింది. భవాని దీక్ష విరమణలు గురువారం నుంచి 5 రోజులపాటు కొనసాగనున్నాయి. దీంతో వారంతా భారీగా తరలివస్తున్నారు. ఇంద్రకీలాద్రిలో 11వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు భవానీ దీక్షా విరమణలు ఉండటంతో దేవస్థానం పాలక మండలి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అగ్ని ప్రతిష్ఠాపనతో ఇరుముడులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హోమ గుండాలను దుర్గగుడి ఈవో, చైర్మన్, ఆలయ స్థానాచారి వెలిగించారు. జై దుర్గా.. జై జై దుర్గా నామస్మరణతో మార్మోగుతోంది ఇంద్రకీలాద్రి. ఈ సందర్భంగా ఆలయ ఈవో శీనా నాయక్, చైర్మన్ బొర్రాగాంధీ మీడియాతో మాట్లాడారు. భవానిల దీక్ష విరమణ సందర్భంగా.. ఇరుముడిని సమర్పించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఏడాది భవానీల సంఖ్య పెరుగుతోందని వివరించారు. ఇరుముడలను సమర్పించడానికి మూడు హోమ గుండాలను ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. 41 రోజులపాటు నియమ నిబంధనలు పాటిస్తూ భవానీలు మాలధారణ చేశారని తెలిపారు. భవాని భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, వెయిటింగ్ హాల్స్, అదనపు పార్కింగ్, 19 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఏపీ నలుమూలల నుంచి 7 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని చెప్పుకొచ్చారు. లక్షలాదిగా తరలివచ్చే భవానీలకు తాగునీరు, ప్రసాదం కొరత లేకుండా అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. 950 మంది క్షురకులు 4,000 మంది పోలీసు సిబ్బంది, 370కు పైగా సీసీ కెమెరాలతో భద్రతను పటిష్ఠం చేశామని పేర్కొన్నారు. అన్ని అర్జిత సేవలు డిసెంబర్ 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిలిపివేశామని తెలిపారు. గిరి ప్రదక్షిణ మార్గంపై వివరాలను అందించే భవానీ దీక్ష 2025 మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. 9 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. భక్తులకు ఎప్పటిక ప్పుడు మానిటరింగ్ చేసే విధంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అన్నారు. సామాన్య భక్తుడికి పెద్దపీఠం వేశామని .. భవానీల కోసం ఉచిత క్యూలైన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

# హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ప్రవాస భారతీయుడు

## ఉదయ్ నాగరాజు ఎన్నికపై కేటీఆర్ అభినందనలు

**హైదరాబాద్, డిసెంబర్ 11 :** బ్రిటన్ ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ప్రవాస భారతీయుడు ఉదయ్ నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ఆయన ప్రస్థానాన్ని కొనియాడారు. ఇంగ్లండ్ రాజు చేతుల మీదుగా హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నామినేట్ అయినందుకు ఉదయ్ నాగరాజు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. యూకేలో పబ్లిక్ ఆఫీస్ కోసం పోటీ చేయడం దగ్గరి నుంచి మొదలుకొని.. నేడు ఈ అరుదైన గౌరవం దక్కించుకోవడం వరకు ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కొత్త బాధ్యతల్లో మీకు అంతా మంచే జరగాలని, మరిన్ని విజయాలు సాధించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఉదయ్ నాగరాజు స్వస్థలం సిద్దిపేట జిల్లా కొహెడ మండలం శనిగరం. సామాన్య మధ్య తరగతి కుటుంబంలో హనుమంత రావు-నిర్మలాదేవి దంపతులకు జన్మించారు. ఆయన వరంగల్, హైదరాబాద్‌లో చదువుకున్నారు. బ్రిటన్‌లోని ప్రముఖ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేశారు. ఆయన ఏఐ ప్రభావాన్ని ముందే పసిగట్టి ఏఐ పాలసీ ల్యాబ్స్ పేరుతో థింక్ ట్యాంక్‌ని నెలకొల్పారు. అలాగే, అంతర్జాతీయ స్థాయిలో వక్తగా పేరుపొందారు. ఇక హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు సభ్యులను ప్రధాని సలహా మేరకు ఇంగ్లండ్ రాజు నామినేట్ చేస్తుంటారు. రాజకీయ పార్టీలు, స్వతంత్ర కమిటీ, ప్రజల నుంచి సైతం నామినేషన్లు వస్తుంటాయి. నైపుణ్యం, అనుభవం, దేశానికి చేసిన సేవ ఆధారంగా హౌస్ ఆఫ్ లార్డ్స్‌కి ఎంపిక చేస్తారు. బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ పని చట్టాలను రూపొందించడం, ప్రభుత్వాన్ని పర్యవేక్షించడం, తదితర అంశాలపై చర్చించడం వంటి విధులు నిర్వహిస్తుంది.






# బంగారం, వెండి ధరల దూకుడు

## 2 లక్షలకు చేరువలో కిలో వెండి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** దేశీయంగా బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. వెండి దూకుడు మామూలుగా లేదు. కిలో వెండి ధర రూ.1,95,400 మార్కును చేరుకొని రూ.2 లక్షల దిశగా దూసుకెళు తోంది.అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి ధరలు పెరిగాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా రేట్లలో కోత ఉన్నప్పటికీ.. భవిష్యత్ వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి కొనసాగుతోంది. దీంతో బంగారం ధరలు స్వల్ప మొత్తంలో పెరగ్గా.. వెండి మాత్రం సరికొత్త గరిష్ఠాలను తాకింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్‌గోల్డ్ ఔన్సు 4,216 డాలర్ల వద్ద ట్రేడవుతు ండగా.. వెండి ఔన్సు 62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో గురువారం మధ్యాహ్నం నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,19, 350 పలుకుతోంది. కిలో వెండి ధర రూ.1,95,400 మార్కును చేరుకొని రూ.2 లక్షల దిశగా దూసుకెళుతోంది.

# అనంతపురం జిల్లాలో దారుణం

- **నలుగురు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం**
- **హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం**

**అనంతపురం, డిసెంబర్ 11 :** అనంతపురం జిల్లాలో దారుణం జరిగింది. కేఎస్ఆర్ జూనియర్ కాలేజీలో నలుగురు బాలికలు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నలుగురు విద్యార్థినులు వాస్మోల్ తాగి ఆత్మహత్యయత్నం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో తాడిపత్రి మండలానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు చదువుతున్నారు. విద్యార్థినుల గురించి తల్లిదండ్రులకు వార్డెన్ వసంత ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినులు భయపడి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం గమనించిన వార్డెన్ వెంటనే వారిని చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలి కల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకుని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు విద్యార్థినుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. బాలికల ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అయితే, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు కుటుంబ సభ్యులు. ఈ ఘటనతో మిగతా విద్యార్థినులు కూడా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# బ్యాలెట్‌లో కనిపించని గుర్తు

## వార్డు ఎన్నిక నిలిపివేత

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 11 :** జిల్లాలోని వెల్దండలో ఓ వార్డులో ఓటింగ్ నిలిచిపోయింది. మండలం కుప్పగండ్ల గ్రామ పంచాయతీలోని పదో వార్డులో అభ్యర్థికి గుర్తు కేటాయించలేదు. వార్డు సభ్యుడి ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు పోటీ చేశారు. అయితే, ఎన్నికల సంఘం తరఫున వచ్చిన బ్యాలెట్ పత్రాలత్లో యాదయ్య అనే అభ్యర్థికి కేటాయించిన గుర్తు కనిపించలేదు. దాంతో ఓటర్లంతా షాక్ అయ్యారు. ఒక అభ్యర్థికి గుర్తు కేటాయించపోవడంతో సదరు అభ్యర్థి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలింగ్‌ను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.



## ప్రశాంతంగా ముగిసిన మొదటి విడత పంచాయతీ ఎన్నికలు

- జిల్లాలో 79.40 శాతం పోలింగ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి కలెక్టరేట్, రాజ ముద్ర న్యూస్ :** 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గురువారం మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి, కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం పలు మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 మొదటి విడతలో కామారెడ్డి జిల్లాలోని 10 మండలాలైన బిక్నూర్, బీబీపేట్, దోమకొండ, కామారెడ్డి , మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి, సదాశివ నగర్, తాడ్వాయి మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరిగింది.

## ఆశీర్వదించి గెలిపిస్తే, ప్రజలకి సేవ చేస్తా

- ఉమ్మడి సర్పంచ్ అభ్యర్థి దండా రంగయ్య
- ప్రచారంలో బ్రహ్మరథం పడుతున్న రాజేశ్వరపురం ప్రజలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే,ప్రజలకి సేవ చేస్తూ,గ్రామాన్ని రాజేశ్వరపురం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని రాజేశ్వరపురం సర్పంచ్ అభ్యర్థి దండా రంగయ్య తెలిపారు. నేలకోం డపల్లి మండలంలోని రాజేశ్వరపురం సర్పంచ్ గా పోటీ చేస్తున్న ఆయన ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి గురువారం గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గెలిచిన వెంటనే అభివృద్ధి ని ముందుకు తీసుకుపోతానని కత్తెర గుర్తుకి ఓటు వేసి తనను గెలిపించాలని ఓట ర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా ప్రతి వార్డులో తనకి గ్రామస్తులు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. తనను గెలిపిస్తే ప్రభుత్వ పథకాలను గ్రామంలోని ప్రజలందరికీ పారదర్శకంగా అందజేస్తానని గ్రామంలో ప్రజలు ఆశీస్సులతో తన గెలుపు నల్లేరు పై నడకేనని రంగయ్య ధీమా వ్యక్తం చేశారు.. ఈ ప్రచారంలో భారీగా ప్రజలు వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.



## తాండూర్‌లో స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ స్వర్ణకుమారి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గురువారం తాండూర్ మండల కేంద్రంలోని ఆర్తి స్కాన్ సెంటర్‌ను వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి ఆకస్మికంగా సందర్శించి స్కానింగ్ సెంటర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్ లో రికార్డులను, ఆన్లైన్ నమోదు వివరాలను, స్కానింగ్ చేస్తున్న డాక్టర్ యొక్క అర్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. గర్భస్థ పిండా లింగ నిర్ధారణ పరీక్షల చట్టం ప్రకారం పరీక్షలు చేసే ప్రతి రేడియాలజిస్టు లేదా గైనకాలజిస్ట్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. జిల్లా పరిధిలోని అన్ని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లాబరేటరీలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మాత్రమే నిర్వహించాలని లేనియెడల పిసిపి ఎన్‌డిటి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం జరిమానా, సీజ్ లేదా క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లాబరేటరీలు రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో డిప్యూటీ డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.






## కార్ కేర్ స్టూడియో, డాట్ కాఫీ సెంటర్‌ను ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని క్రాంతి వనం కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన 3 ఎమ్ కార్ కేర్ స్టూడియా, డాట్ కాఫీ సెంటర్‌ను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కార్యక్రమంలో 3 ఎమ్ కార్ స్టూడియో చైర్మన్లు కళ్యాణ్, రవి, ప్రశాంతి, నాయకులు గణేష్ ముదిరాజు, మారబోయిన రాజు యాదవ్, మల్లేష్ యాదవ్, తిరుపతి, వెంకటేశ్వరరావు, శశాంక్, పవన్, వరుణ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవాలు నిషేధం

- మూడు దశల పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎంసిసి అమలు
- తొలి దశలో గెలిచిన అభ్యర్థుల విజయోత్సవాలకు డిజేలకు పూర్తిగా నిషేధం
- నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఎన్నికల ఫలితాలు వచ్చిన సమయంలో ర్యాలీలు, బైక్ శోభాయాత్రలు పూర్తిగా నిషేధమని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. జిల్లాలో మూడు దశల పంచాయతీ ఎన్నికల పూర్తి ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లోనే కొనసాగుతుందని పేర్కొన్నారు. తొలి దశ ఫలితాలు వచ్చినా గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, భారీ సభలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు వంటి వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎంసీసీ కొనసాగుతున్నంతకాలం ఈ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాల్సిందే. నియమాలను అతిక్రమించే వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. శాంతియుత వాతావరణం కోసం ప్రజలు, నాయకులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## అనుమానాస్పద 3.02 కోట్ల ఐఆర్‌సీటీసీ ఖాతాల తొలగింపు

### రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



**న్యూఢిల్లీ,డిసెంబర్11 :** తత్కాల్ టికెట్ల జారీ విషయంలో ఇటీవల అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఐఆర్‌సీటీసీ ఖాతాల ఏరివేతనూ అదే స్థాయిలో చేపట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 3.02 కోట్ల అనుమానాస్పద యూజర్ ఐడీలను డీయాక్టివేట్ చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ౦ఐ౦౦౦ఎ వంటి యాంటీ బాట్ టెక్నాలజీని వినియోగించి నకిలీ, ఆటోమేటెడ్ ప్రయత్నాలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో ఆయన ఓ ప్రశ్నకు ఆయన గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.సామాన్యులకు సాధారణ, తత్కాల్ టికెట్లు అందేలా రిజర్వేషన్ వ్యవస్థ తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. తత్కాల్ వ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఆధార్ బేస్డ్ ఓటీపీ వ్యవస్థను దశలవారీగా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం 322 రైళ్లకు దీన్ని వర్తింపజేశామన్నారు. దీని ద్వారా ఆయా రైళ్లలో తత్కాల్ టికెట్ల అందుబాటు సమయం దాదాపు 65 శాతం మేర పెరిగిందని చెప్పారు. అలాగే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తత్కాల్ బుకింగ్స్‌కు ఓటీపీ వెరిఫికేషన్ విధానాన్ని డిసెంబర్ 4 వరకు 211 రైళ్లకు వర్తింపజేసినట్లు తెలిపారు. దీనివల్ల 96 పాపులర్ ట్రైన్ల టికెట్ల అందుబాటు సమయం 95 శాతం మేర పెరిగిందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

## పాలేరులో కాంగ్రెస్ గెలుపు కోసం జోరుగా ప్రచారం


### అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలి : పొంగులేటి ప్రసాద్ రెడ్డి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రెండో విడత గ్రామపంచాయతీ ప్రచారం ముగియడానికి కేవలం ఒక్కరోజు మాత్రమే ఉండటంతో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యకలాపాలను మరింత వేగవంతం చేసింది. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ నేతలు ఇంటింటికీ తిరిగి హడావిడి చేస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతున్నారు. తిరుమలాయపాలెం మండలంలోని ముజాహిద్‌పురం,కాకరవాయి, బీరోలు, ఏలువారిగూడెం గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తమ్ముడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. నేలకొండపల్లి మండలంలో మంత్రి మేనల్లుడు, క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంగాపురం తండా, అప్పలనరసింహాపురం, రాయగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రజల మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచార సభల్లో వారు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి నాయకత్వంలో పాలేరు అభివృద్ధి బాటలో వేగంగా దూసుకుపోతోందన్నారు. గ్రామ స్థాయిలో ఈ అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీ,మిత్రపక్షాలు బలపరిచిన సర్పంచ్,వార్డు సభ్యులు గెలవాలని పిలుపునిచ్చారు. మంత్రి పొంగులేటి తమ్ముడు ప్రసాద్ రెడ్డి,మేనల్లుడు దయాకర్ రెడ్డి ఇద్దరూ ప్రచార రంగంలో దూకుడుగా దిగడంతో పాలేరు మొత్తం కాంగ్రెస్ శక్తి ప్రదర్శనతో కోలాహలంగా మారింది. గ్రామాల్లో కాంగ్రెస్ నేతల జోరు, ప్రజల్లో కనిపిస్తున్న ఉత్సాహం ఇవి రెండూ అధికార పార్టీకి అనుకూలంగా వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి,మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్,సర్పంచ్ అభ్యర్థులు కటుకూరి శ్రీనివాస్ రెడ్డి, బానోత్ రవి (డీలర్),పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

### కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పిలుపు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లిలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి లావూరి కోటేశ్వరరావు, వార్డు సభ్యుల విజయాన్ని కాంక్షిస్తూ రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమ్ముడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు నెల్లూరి భద్రయ్య, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెల్లూరి భద్రయ్య మాట్లాడుతూ,, 35 సంవత్సరాలుగా నన్ను ఓడించడానికి, అన్ని పార్టీల నాయకులు పొత్తులతో ప్రయత్నం చేశారని, గత సర్పంచ్ ఎన్నికలలో నా భార్య టిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయగా, టిఆర్ఎస్ పార్టీ మొత్తం నా దగ్గర డబ్బులు తీసుకుని అవతల వారిని గెలిపించాలని అన్నారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో ఉండి, మిగతా పార్టీలతో పొత్తు పెట్టుకుని, ఏకగ్రీవం అయ్యే గ్రామాన్ని చెడగొట్టారని అన్నారు. పొంగులేటిని కాదని, వేరే పార్టీ వాళ్లతో కాంగ్రెస్ నాయకులను పొత్తు పెట్టుకుంటే వారిని కాంగ్రెస్ పార్టీ బహిష్కరిస్తుందని అన్నారు. కావునా ఇప్పటికైనా ప్రజలందరూ ఆలోచించి గ్రామం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లావురు కోటేశ్వరావు ఉంగరం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యులను అత్యధిక మెజారిటీతో గెలిపించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గిఫ్ట్ గా ఇవ్వాలని అన్నారు. శ్రీనన్న ప్రకటించిన అభ్యర్థిని గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీలో ఉండి ఎవరైనా తప్పుడు ప్రచారం, తప్పుడు వ్యవహారాలు చేసిన వారిని పార్టీ బహిస్కరిస్తుందని అన్నారు. గ్రామంలోనీ స్థానిక నాయకుడు భద్రన్న చెప్పిన అన్ని పనులను పూర్తి చేస్తామని ఆయన అన్నారు. అత్యధిక మెజారిటీతో సర్పంచ్ అభ్యర్థి గెలిపిస్తే ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని అన్నారు.



## భద్రాద్రి జిల్లాలో మొదటి విడతలో సిపిఐ హవా

- 50శాతంకుపైగా సీట్లు సాధించి సత్తా చాటిన అభ్యర్థులు
- దుమ్ముగూడెంలో ఐదు స్థానాలకు పోటీచేసి ఐదింటిలో గెలుపు
- వార్డు స్థానాల్లోనూ సిపిఐ ఆదే జోరు
- అభ్యర్థులకు అభినందనలు తెలిపిన కూనంనేని -సాబీర్ పాషా

**కొత్తగూడెం ప్రతినిధి, డిసెంబర్ 11:** జిల్లాలో మొదటివిడతలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ హవా కొనసాగింది. జిల్లాలోని దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక, మణుగూరు, కారకగూడెం మండలాల్లో గురువారం మొదటివిడత ఎన్నికలు జరగగా ఈ మండలాల్లో సిపిఐ పోటీ చేసిన స్థానాల్లో యాభై స్థానాలు కైవసం చేసుకుంది. దుమ్ముగూడెం మండలంలో ఐదు స్థానాలకు పోటీ చేసి ఐదు స్థానాలు కైవసం చేసుకుంది. దుమ్ముగూడెం మండలంలో తూరుబాక, నర్సాపురం, పెద్ద ఆర్లగూడెం, పాత బండారుగూడెం, చర్లమండలంలో కార్నెపల్లి, తిప్పాపురం, మణుగూరుమండలంలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీలు సిపిఐ కైవసం చేసుకుంది. సర్పంచి స్థానాలతో పాటు 56 వార్డు స్థానాల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. మణుగురుమండలంలోని రామాంజవరం గ్రామపంచాయతీలో కౌంటింగ్ కొనసాగుతుండగా సిపిఐ అభ్యర్థి ముందంజలో ఉన్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అభినందనలు తెలిపారు.




## మొలంగూర్ కోటకు జాతీయ హోదా ఇవ్వండి

### బీసీ ఆజాది ఫెడరేషన్ వినతి

**మానకొండూర్, డిసెంబర్ 11:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటూ బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం గురువారం ఢిల్లీలోని జాతీయ పురావస్తు కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ యాద్బీర్ సింగ్ రావత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ చరిత్రపుటల్లో ప్రత్యేక స్థానమున్న మొలంగూర్ ఖిల్లా ప్రభుత్వం నిర్లక్ష్యంతో అభివృద్ధి దూరమైందన్నారు. గతంలో గ్రానైట్ వ్యాపారులు ఖిల్లాపై కన్నేసి నాశనం చేయాలనుకున్నా ప్రజా పోరాటాలతో ఆ ప్రయత్నాలను అడ్డుకున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ కోటను జాతీయ వారసత్వ సంపదగా గుర్తించి నిధులు కేటాయిస్తే ఉత్తర తెలంగాణ పర్యాటకానికి కొత్త ఊపు వస్తుందన్నారు. రవాణా సౌకర్యాలు సమృద్ధిగా ఉన్న మొలంగూర్ ఖిల్లా అభివృద్ధి చేస్తే కరీంనగర్ జిల్లాకు ప్రతిష్ట పెరిగే అవకాశం ఉందని, తక్షణమే పునరుద్ధరణ పనులు ప్రారంభించాల్సిందిగా వారు కోరారు. వినతి సమర్పణలో రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుడికల భాస్కర్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్, ములుగు జిల్లా అధ్యక్షులు ఉర్లగొండ మురళి, రాష్ట్ర నాయకులు ఒడ్నాల రవీందర్, బొంగోని అభిలాష్, వరాల అనిల్, ఉట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## పాతర్లపాడులో ఎగిరిన ఎర్రజెండా

- సర్పంచ్ సీటు కైవశం
- మొత్తం 12 వార్డులకు గాను 11 వార్డులలో విజయకేతనంశా
- సామినేని రామారావు హత్యకు ఘన నివాళులు అర్పించిన ప్రజలు
- హత్యపై ఇంకా నిగ్గుతేల్చని పోలీసులు
- పోలీస్ విచారణపై సందేహాలు

**చింతకాని, ఆర్గాన్ న్యూస్:** అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన చింతకాని మండలం పాతర్లపాడు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా సిపిఎం అభ్యర్థి 567 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 12 వార్డులు ఉండగా 11 వార్డుల్లో విజయం సాధించారు దీంతో ఈ గ్రామంలో ఎర్రజెండాకు తిరుగులేదని మరోసారి గ్రామ ప్రజలు నిరూపించారు. ఇటీవలే మాజీ సర్పంచ్ , సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్య జరిగింది ఆయనకు ఈ తీర్పు ద్వారా మరోసారి గ్రామ ప్రజలు ఘనమైన నివాళులు అర్పించినట్లైంది. జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారిన ఈ హత్య విషయంపై ఇప్పటివరకు హంతకులు ఎవరు అనేది నిగ్గు తేలకపోవడం చర్చనీయాంశంగా మారింది. హత్యకు సంబంధించిన వివారాలు పోలీసులు ఇప్పటివరకు తేల్చలేకపోయారనే విమర్శల పర్వం సాగుతుంది.దీంతో పోలీస్ శాఖ వైఫ్యలంపై సిపిఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది హత్య ఎవరు చేశారు అనేదాన్ని నిగ్గుతేల్చలేపోతున్న పోలీస్ శాఖపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



# ఉక్రెయిన్‌లో శాంతి కోసం.. రష్యాకు ట్రంప్ భారీ ఆఫర్లు..

**యూఎస్ :** ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్నటివరకు కాల్పుల విరమణకు అంగీకరించాలని రష్యాపై ఆంక్షలు విధిస్తూ ఒత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ట్రంప్ తన విధానాన్ని మార్చుకున్నట్లుగా ఉంది. మాస్కోకు అనుకూలంగా కొన్ని ఆఫర్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. కథనం ప్రకారం.. ఇటీవల యూరోపియన్ దేశాలకు అందజేసిన శాంతి ప్రణాళికలో అనుబంధంగా ట్రంప్ తాజా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో ఐరోపా దేశాలకు రష్యా నుంచి ఇంధన సరఫరాను పునరుద్ధరించాలనేది కూడా ఒకటి. ఆ దేశంలోని అరుదైన ఖనిజ రంగాల్లో పెట్టుబడులు పెట్టడంతో పాటు.. స్తంభింపజేసిన రష్యా ఆస్తుల విడుదల వంటి పలు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనిలోనే అమెరికా వ్యాపార, ఆర్థిక సంస్థలు స్తంభింపజేసిన రష్యా సావరిన్ ఫండ్ నిధులను ఉక్రెయిన్‌లో ప్రాజెక్టులకు వినియోగించే ప్రణాళిక ఉంది. జపోరిజియా అణు విద్యుత్తుకేంద్రం శక్తితో ఓ డేటా సెంటర్ ఏర్పాటు వంటి అంశాలున్నాయి. రష్యాలోని అరుదైన ఖనిజాల వెలికితీత, చమురు తవ్వకం వంటి వ్యూహాత్మక రంగాల్లో అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టే విషయాన్ని ప్రస్తావించారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముగించేందుకు ట్రంప్ ఇటీవల 28 సూత్రాలతో శాంతి ప్రణాళికను రూపొందించారు. ఇందులో ఎక్కువ అంశాలు రష్యాకు అనుకూలంగా ఉన్నాయని నాటో దేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ క్రమంలో ఇందులో సవరణలు సూచించాయి. ఈ శాంతి ప్రణాళికను ముందుకు తీసుకెళ్లే అంశంపై అగ్రరాజ్యం మధ్యవర్తిత్వంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చల్లో కీవ్ నుంచి సరైన స్పందన రాకపోవడంపై ట్రంప్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శాంతి ప్రతిపాదనను ఇంకా చదవకపోవడం తనను నిరాశ పరిచిందన్నారు. ఆ దేశ ప్రజలు ఇష్టపడుతున్న దీన్ని.. జెలెన్‌స్కీ మాత్రం అంగీకరించడం లేదన్నారు.

# కృత్రిమమేధకు మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు

**మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల వెల్లడి**



**బెంగుళూరు, డిసెంబర్ 11 :** భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల తెలిపారు. క్లోడ్ కంప్యూటింగ్ వ్యవస్థను కూడా మైక్రోసాఫ్ట్ మరింత పటిష్టం చేసేందుకు పనిచేస్తున్నట్లు చెప్పారు. మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల ఇవాళ బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఉత్తమైన మౌళిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు చెప్పారు. సుమారు 17.5 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్లు సత్యానాదెళ్ల తెలిపారు. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్‌కు చెందిన అత్యంత భారీ పెట్టుబడి ఇదేఅని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్లౌడ్ లాట్‌ఫామ్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్ తెలిపారు. అజూర్ కంప్యూటర్ వ్యవస్థపై వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 70 కన్నా ఎక్కువ సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయన్నారు. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్ సెంటర్లు పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. గిట్‌హబ్ లో 2030 నాటికి ఇండియా నెంబర్ వన్‌గా మారుతుందని ఆయన అంచనా వేశారు. భారత్‌లో జియోతోనూ భాగస్వామ్యం ఉందన్నారు. 2026లో కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్‌గా మారనున్నట్లు నాదెళ్ల చెప్పారు. దక్షిణమధ్య భారతంలో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయ-ంబోనున్నట్లు నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సుమారు రెండు కోట్ల మంది భారతీయులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నాదెళ్ల తెలిపారు. ప్రభుత్వానికి చెందిన ఈ-శ్రమ్ ప్రోగ్రామ్ ద్వారా అసంఘటిత కార్మికులను ఏఐతో చైతన్యపరచవచ్చు అన్నారు. భారత్‌లోని ప్రతి వ్యక్తిని, ప్రతి సంస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నాదెళ్ల పేర్కొన్నారు.

## థాయిలాండ్‌లో లూథ్రా సోదరుల అరెస్ట్

**త్వరలోనే భారత్‌కు అప్పగించనున్న అధికారులు**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** గోవా నైట్‌క్లబ్‌లో ఇటీవల భారీ అగ్ని ప్రమాదం సంభవించి 25 మంది మృతికి కారణమైన.. ఆ క్లబ్ యజమానులు అరెస్ట్ అయ్యారు. ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే ఓనర్లు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రా సోదరులు విదేశాలకు తరలివెళ్లారు. పరారీలో ఉన్న వారిని తాజాగా థాయ్‌లాండ్‌లో అక్కడి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 6న రాత్రి 'బిర్చ్ బై రోమియో లేన్ క్లబ్'లో ఈ ప్రమాదం జరగ్గా.. కొన్ని గంటలకే నిందితులైన లూథ్రా సోదరులు పరారయ్యారు. డిసెంబర్ 7న తెల్లవారుజామున 5:30 గంటలకు థాయిలాండ్‌లోని పుకెట్ వెళ్లే ఇండిగో ఫ్లైట్ ఎక్కి విదేశాలకు పారిపోయి నట్టు తేలింది. దీంతో గాలింపు చర్యల్లో భాగంగా వారిపై లుక్‌అవుట్ నోటీసులు జారీచేశారు. ఈ నేపథ్యంలో వారి పాస్‌పోర్టు(ఖజీబబనీసబి)లు సస్పెండ్ చేశారు అధికారులు. కాబట్టి వారు చట్టం ప్రకారం ఆ దేశంలో ఉండటానికి అనర్హులు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అరెస్టైన లూథ్రా సోదరులను త్వరలోనే భారత్‌కు తరలించే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం గోవాకు చెందిన పోలీస్ బృందం థాయ్‌లాండ్‌కు వెళ్లనుంది. అంతకముందు.. అరెస్ట్‌కు భయపడి లూథ్రా సోదరులు ఇండియాకు తిరిగి వచ్చేందుకు నిరాకరించారు. ఈ విషయమై ముందస్తు బెయిల్ కోరుతూ ఢిల్లీలోని రోహిణీ కోర్టును కూడా ఆశ్రయించారు. తాము థాయ్‌లాండ్‌కు వెళ్లింది తప్పించుకోవడానికి కాదని, వ్యాపార పనుల నిమిత్తం మాత్రమేనని పేర్కొన్నారు.

# ఇండిగో బంపర్ ఆఫర్

**ఒక్కో ప్రయాణికుడికి పదివేల గిఫ్ట్ ట్రావెలర్ ఓచర్**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** కొన్ని రోజులుగా తీవ్ర సంక్షోభంలో ఇరుక్కున్న దేశీయ విమానయాన సంస్థ ఇండిగో. పరిస్థితులు ఇప్పుడు దాదాపు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యం లో ఆ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల.. ఇండిగో ఫ్లైట్ సర్వీసులు రద్దు కావడంతో ఇబ్బందిపడిన ప్రయాణికు లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. వారికి పరిహారం కింద రూ.10 వేల విలువైన ట్రావెల్ ఓచర్ అందిస్తామని స్పష్టం చేసింది. ఇండిగో సంస్థకు చెందిన వందలాది విమానాలు ఒక్కసారిగా రద్దవడంతో.. ఈనెల 3, 4 , 5 తేదీలలో ప్రయా ణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేల మంది ప్రయాణి కులు ఎయిర్‌పోర్టు(ంతిసూనీసబి)ల్లో చిక్కుకుని తీవ్ర ఆందోళ నకు గురయ్యారు. ఈ నేపథ్యంలో వారికి ఉపశమనం కలిగి స్తూ.. పరిహారం చెల్లించే దిశగా ముందడుగేసింది ఇండిగో. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(ఆఉఅం) మార్గదర్శ కాలకు అనుగుణంగా బాధిత ప్రయాణికులకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకూ ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్టు పేర్కొంది. రద్దయిన విమానాల కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ లు కోరిన ఇండిగో.. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకుంటామంది. కంపెనీ అందించే ఈ ట్రావెల్ ఓచర్ విలువ రూ.10వేల వరకూ ఉండనుంది. రానున్న 12 నెలల్లో ప్రయాణించేందుకు వీటిని ఉపయోగించుకోవచ్చని తెలిపింది ఇండిగో. అయితే.. ఏయే ప్రయాణికులకు ఎంత మేర పరిహారం కింద చెల్లిస్తారనే వివరాలపై ఇంకా స్పష్టత రాలేదు.

## చైనా సరిహద్దు వెంట ఘోర రోడ్డు ప్రమాదం

- లోయలో పడ్డ ట్రక్కు.. 22మంది దుర్మరణం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** దేశంలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇండో - చైనా సరిహద్దు వెంబడి ఉన్న హుయులియాంగ్ - చగ్లగామ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. అస్సోంలోని టిన్సుకియా జిల్లాకు చెందిన రోజు వారి కూలీలను తీసుకువెళ్తున్న ఓ ట్రక్కు మార్గమధ్యలో ఈ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ఉన్న 22 మంది కూలీలు చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. వాస్తవానికి ఈ ఘటన సోమవారం అంటే మూడు రోజుల క్రితం జరిగింది. ఈ ప్రమాదం నుంచి ఓ కార్మికుడు గాయాలతో బయటపడి పట్టణానికి చేరుకున్నాడు. అతడు ఇచ్చిన సమాచారం వల్లనే ఈ విషాద ఘటన గురించి పోలీసులకు తెలిసింది. గాయపడ్డ ఆ కార్మికుడి మెరుగైన చికిత్స కోసం అస్సాంకు తరలించారు. ప్రమాద ఘటన గురించి అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కొజిన్ ధృవీకరించారు. ప్రమాదంపై మాట్లాడుతూ.. ఈ ఘటన అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి దాదాపు 10 వేల అడుగుల ఎత్తులో ఉందన్నారు. ఇప్పటి వరకు 17 మృతదేహాలను వెలికి తీసినట్లు తెలిపారు. రెస్క్యూ టీమ్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మిలో కొజిన్ వెల్లడించారు.

## అజ్ఞాతం వీడిన నోబెల్ శాంతి గ్రహీత మచాడో

- నార్వేలో ప్రత్యక్షమై.. మద్దతుదారులకు అభివాదం
- తల్లి తరపున ఓస్లోలో అవార్డు స్వీకరించిన కూతురు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** ఈ ఏడాది ప్రతిష్మాత్మక నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, వెనెజువెలా విపక్ష నేత మరియా కొరినీ మచాడో అజ్ఞాతం వీడారు. దాదాపు ఏడాది పాటూ అజ్ఞాతంలో ఉన్న ఆమె తాజాగా నార్వేలో ప్రత్యక్షమయ్యారు. నార్వేలోని ఓ హోటల్ వద్ద బహిరంగంగా కనిపించారు. ఈ మేరకు తన మద్దతుదారులకు అభివాదం చేశారు. కాగా, ఈ ఏడాది నోబెల్ బహుమతి మచాడోను వరించిన విషయం తెలిసిందే. బుధవారం నార్వే రాజధాని ఓస్లోలో ప్రదానోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మచాడో హాజరుకాలేదు. దీంతో ఆమె కుమార్తె నోబెల్ బహుమతిని స్వీకరించారు. ఇక ఈ కార్యక్రమం జరిగిన కొన్ని గంటల్లోనే మచాడో అజ్ఞాతం వీడి పబ్లిక్‌లోకి వచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. వెనెజువెలాలో మదురో నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా అనేక ఏళ్లుగా సాగుతున్న ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమానికి మచాడో సారథ్యం వహిస్తున్నారు. ఆమె బెదిరింపులను ఎదుర్కోవడమే కాక అరెస్టు కూడా అయ్యారు. ప్రయాణ నిషేధాలను, రాజకీయ వేధింపులను ఎన్నో ఎదుర్కొన్నారు. ఇన్ని కష్టాలను తట్టుకుని కూడా ఆమె వెనెజువెలాలోనే ఉండి ఉక్కు మహిళగా గుర్తింపు పొందారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ఆమె పోటీ చేయకుండా నిషేధం విధించారు. తమదే నిజమైన విజయమని ప్రతిపక్షం ప్రకటించుకున్నప్పటికీ మదురో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రతిపక్షాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలతో మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రురాలైన మచాడో 2013లో సహవ్యవస్థాపకురాలిగా వెంటే వెనెజువెలా పేరిట ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి దాని జాతీయ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు.

## వంటింటి సామాన్లతో సిద్ధంగా ఉండండి

- సర్‌లో ఓట్లు తొలగిస్తే దాడి చేయండి
- మహిళలకు మమతా బెనర్జీ పిలుపు



**కోల్‌కతా, డిసెంబర్ 11 :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ మ-రోమారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, ఢిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా గురువారం మహిళలను ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో పేర్లు తొలగింపునకు గురైతే కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారా..? ఎన్నికల సమయంలో ఢిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మిమ్మల్ని బెదిరిస్తారు. జాబితాలో మీ పేరు లేకపోతే..మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయికదా..! వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారివెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో భాజపా డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుంది. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాశ్ చంద్రబోస్ వంటివారు ఏనాడు ప్రజలను విభజించేలా వ్యవహరించలేదు. మరి మీరంతా ఎవరు..? భారత స్వాతంత్య్రం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారు. ఇప్పుడు భారత పౌరులుగా నిరూపించుకోవాలని కృష్ణానగర్ ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో భాజపా ఎంపీలకు ఇటీవల ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి) దిశానిర్దేశం చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు.

## ఆందోళనకరంగా అమిత్ షా తీరు

- ఆయన భాష కూడా సరిగా లేదు
- విపక్ష నేత రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభ సమావేశాల్లో జరిగిన చర్చ సందర్భంగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆందోళనకరంగా ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆయన భాష కూడా స్పష్టంగా లేదని..అమిత్ షా ప్రసంగాన్ని ఉద్దేశించి అన్నారు. 'బుధవారం నాటి సమావేశంలో.. ఓటు చోరీ అంశంపై మీడియా ముందు నేను చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్‌లో చర్చకు తీసుకురావాలని అమిత్ షాకు సవాల్ విసిరాను. ఆ సమయంలో ఆయన ఆందోళనకరంగా కనిపించారు. భాష కూడా సరిగ్గా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పలేకపోయారు. ఎలాంటి ఆధారాలూ చూపడం లేదు. మానసికంగా ఒత్తిడికి లోనయ్యారు. మీరూ ఆ విషయాన్ని గమనించే ఉంటారు' అని అమిత్ షానుద్దేశించి రాహుల్ అన్నారు. అయితే.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ వర్గాలు స్పందిస్తూ.. నిన్న చర్చలు జరిగే సమయానికి అమిత్ షా అనారోగ్యానికి గురయ్యారని తెలిపాయి. లోక్ సభలో ప్రసంగించేందుకు లేచి నిల్చున్నప్పుడు ఆయన 102 డిగ్రీల జ్వరంతో ఇబ్బంది పడ్డారని చెప్పాయి. సమావేశం ప్రారంభానికి ముందే ఆయన్ను వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారని పేర్కొన్నాయి. కాగా, ఈ చర్చ సందర్భంగా.. అమిత్ షా సుమారు 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఓటు చోరీ అంశంపై రాహుల్ చేస్తున్న ఆరోపణల్ని కొట్టిపారేశారాయన. కాంగ్రెస్ పార్టీయే ఓటు చోరీకి పాల్పడిందని, నాయకత్వ లోపమే ఆ పార్టీ ఎన్నికల్లో పరాజయం చెందడానికి కారణమని షా విమర్శించారు.



## ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి

**భారతీయ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగం అర్జున్**


**మేడ్చల్ :** గ్రామంలోని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు భారతీయ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగం అర్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పేద, మధ్య తరగతి సామాన్య కుటుంబాలకు షుగర్, బీపీ, జనరల్ చెకప్ సేవలను అందించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాగం అర్జున్ మాట్లాడుతూ అనారోగ్యం పేదలకు, వృద్ధులకు భారమైతదని వారి ఆరోగ్యం బాగుండాలనే సదుద్దేశంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగేటి హన్మంత్ రెడ్డి, కొండం ఆంజనేయులు, నీరుడి దశరథ్, అనిల్ రెడ్డి, తావుల శివ, నిరుడు నిఖిల్ పాల్గొన్నారు.

# నాలుగు రాష్ట్రాల్లో ముగిసిన సర్ ప్రక్రియ

**కొన్ని రాష్ట్రాల్లో పొడిగించిన ఎన్నికల సంఘం**


**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఎన్నికల సంఘం తాజా అప్‌డేట్ ఇచ్చింది. వీటిలో తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ సహా అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ గడువును పొడిగించింది. పశ్చిమబెంగాల్, రాజస్థాన్, లక్షద్వీప్, గోవాల్లో మాత్రం ఈ గడువు గురువారంతో ముగిసింది. తమిళనాడు, గుజరాత్‌లలో డిసెంబర్ 14వరకు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులకు డిసెంబర్ 18వరకు, ఉత్తర్ ప్రదేశ్‌లో డిసెంబర్ 26 వరకు గడువు పెంచుతున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. వీటికి అనుగుణంగా సవరణ జాబితా ప్రచురణ తేదీలు కూడా మార్చినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ సర్‌పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 'సర్' గడువును పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. రెండో దశ కింద మొత్తం 12 రాష్ట్రాల్లో్ర, యూటీల్లో 'సర్' పక్రియ చేపట్టింది ఈసీ. అందులో భాగంగా డిసెంబర్ 11లోగా పూర్తి చేయాలని నిర్ణయించింది. గోవా, లక్షద్వీప్, రాజస్థాన్, పశ్చిమ్ బెంగాల్‌లలో ఈ గడువు ముగిసింది. ఈ నాలుగు రాష్ట్రాల ముసాయిదా ఓటర్ల జాబితా డిసెంబర్ 16 ప్రచురించనున్నట్టు ఈసీ తెలిపింది. 2026లో పశ్చిమ్ బెంగాల్‌లో ఎన్నికల నేపథ్యంలో.. 'సర్' గడువు పొడిగిస్తారని అంతా భావించారు. కానీ, ఈసీ ఆ అవకాశం లేకుండా చేసింది. తాజా పొడిగింపునకు ముందు ఈసీ కేరళ షెడ్యూల్‌ను సవరించింది. డిసెంబర్ 18 వరకూ గడువు నిర్దేశిరచింది. ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని పేర్కొంది.

## అఫ్గాన్‌పై పాక్ దాడులను ఖండిస్తున్నాం: భారత్




**న్యూఢిల్లీ, డిసెంబర్ 11 :** అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడటాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. చిన్నారులు, మహిళలు, క్రికెటర్లపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన చర్చలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఐక్యరాజ్య సమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుంది. అమాయకులైన పౌరుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం సరికాదు. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న అఫ్గాన్‌పై బహిరంగ బెదిరింపులు, యుద్ధచర్యలు వంటివి అంతర్జాతీయ చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమే. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను తాము సమర్థిస్తున్నామని ఉద్ఘాటించారు. అక్కడి భద్రతా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా, లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర సంస్థలు సరిహద్దు ఉగ్రవాదంలో పాల్గొనకుండా చేయాలని పిలుపునిచ్చారు. అఫ్గాన్ ప్రభుత్వంతో సంబంధాలు పెంచుకోవడంపై భారత వైఖరిని ఉద్ఘాటించారు.

# ఆండ్రాయిడ్ ఫోన్లకు 'ఎమర్జెన్సీ లైవ్ వీడియో' ఫీచర్




ఆండ్రాయిడ్ యూజర్ల కోసం గూగుల్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. అత్యవసర సమయాల్లో రియల్‌టైమ్ వీడియోను షేర్ చేసేలా ఎమర్జెన్సీ లైవ్ వీడియో పేరిట ఈ ఫీచర్‌ను పరిచయం చేసింది. ఆండ్రాయిడ్ ఎమర్జెన్సీ లొకేషన్ సర్వీస్ (ఈఎల్ఎస్)పై ఇది పనిచేస్తుందని గూగుల్ తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది. ఎమర్జెన్సీ సేవలకు సంబంధించిన కాల్ లేదా టెక్ట్స్ సమయంలో అవతలి వ్యక్తి అక్కడి పరిస్థితిని వివరించాలని కోరినప్పుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుందని తెలిపింది. ఆ సందర్భంలో సింగిల్ ట్యాప్‌తో లైవ్ వీడియోను స్ట్రీమ్ చేయొచ్చని, యూజర్ నచ్చినంతసేపు టెలికాస్ట్ చేయొచ్చని గూగుల్ తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో కొన్నిసార్లు పరిస్థితిని వివరించడం కష్టంగా ఉంటుందని, దీన్ని దృష్టిలోపెట్టుకొనే ఎమర్జెన్సీ లైవ్ వీడియో ఫీచర్‌ను తీసుకొచ్చినట్లు గూగుల్ ప్రెసిడెంట్ (ఆండ్రాయిడ్ ఎకోసిస్టమ్) సమీర్ సమత్ తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో జీపీఎస్, సెల్, వైఫై, ఇతర సెన్సార్ల సాయంతో కచ్చితమైన లొకేషన్‌ను ఎమర్జెన్సీ సేవల విభాగానికి ఈ సదుపాయం అందిస్తుందని గూగుల్ తెలిపింది. ప్రస్తుతానికి అమెరికా, జర్మనీ, మెక్సికో దేశాల్లో ఈ సేవలు ప్రారంభిస్తున్నామని, త్వరలో ఇతర దేశాలకూ విస్తరిస్తామని పేర్కొంది. రోడ్డు ప్రమాదాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల సమయంలో ఈ సదుపాయం పనికొస్తుందని తన బ్లాగ్‌పోస్ట్‌లో వెల్లడించింది.






## ఏథర్ రిజ్టా విక్రయాల్లో దూకుడు..

### 20 నెలల్లో 2 లక్షల మైలురాయి

ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీకి చెందిన ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్ రిజ్టా అరుదైన మైలురాయిని సాధించింది. దేశవ్యాప్తంగా 2 లక్షల విక్రయాల మైలురాయిని అందుకుంది. ఈ ఏడాది మే నెలలోనే లక్ష స్కూటర్ల మైలురాయిని చేరుకున్న.. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్.. ఏడు నెలలు తిరగకముందే మరో లక్ష స్కూటర్లను విక్రయించింది. ఏథర్ ఎనర్జీ విక్రయిస్తున్న వాహనాల్లో బెస్ట్ సెల్లింగ్ మోడల్‌గా నిలిచింది. 2024 ఏప్రిల్‌లో రిజ్టాను ఏథర్ ఎనర్జీ లాంచ్ చేసింది. అప్పటి వరకు కేవలం దక్షిణాది రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైన ఏథర్‌ను.. మధ్య భారతానికి విస్తరించడానికి ఈ స్కూటర్ ఎంతగానో దోహదపడింది. ఏథర్ మొత్తం విక్రయాల్లో ఒక్క రిజ్టా వాటానే 70 శాతం మేర ఉందంటే ఈ స్కూటర్‌కున్న డిమాండ్ ఏపాటిదో తెలుస్తోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఈ ఏడాది (క్యాలెండర్ సంవత్సరం) క్యూ1లో 7 శాతంగా ఉన్న ఏథర్ మార్కెట్ వాటా.. క్యూ3లో 14 శాతానికి పెరిగింది. పంజాబ్‌లో 8 నుంచి 15 శాతానికి, ఉత్తర్‌ప్రదేశ్‌లో 4 నుంచి 10 శాతానికి పెరిగింది. ఏథర్ రిజ్టా ఫ్యామిలీ స్కూటర్ ద్వారా మధ్య, ఉత్తర భారతంలో తమ మార్కెట్ బాగా వృద్ధి చెందిందని ఏథర్ ఎనర్జీ సీబీఓ రవ్‌నీత్ సింగ్ తెలిపారు. తమ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను, తమ మార్కెట్ వాటాను మరింత పెంచుకుంటామని తెలిపారు. ఇక రిజ్టా విషయానికొస్తే.. ఇది రెండు మోడళ్లలో లభ్యమవుతుందది. రిజ్టా ఎస్, రిజ్టా జడ్. రిజ్టా ఎస్ 123 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్‌తో తీసుకొచ్చారు. రిజ్టా జడ్ సింగిల్ ఛార్జ్‌తో 159 కిలోమీటర్లు ప్రయణించొచ్చు. విశాలమైన సీట్, అధిక స్టోరేజీ కెపాసిటీ, లెగ్‌స్పేస్ కారణంగా ఈ స్కూటర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. దీనికితోడు స్కిడ్ కంట్రోల్, ఫాల్ సేఫ్, ఎమర్జెన్సీ స్టాప్ సిగ్నల్, థెఫ్ట్ అండ్ టో అలర్ట్స్, పింగ్ మై స్కూటర్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. భారత్ సహా శ్రీలంక, నేపాల్‌లోనూ దీన్ని ఏథర్ విక్రయిస్తోంది.



## 3 రోజుల వరుస నష్టాలకు బ్రేక్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఎట్టకేలకు లాభాల్లో ముగిశాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లలో పావు శాతం మేర కోత పెట్టడం మన సూచీలకు కలిసొచ్చింది. విదేశీ మదుపర్ల విక్రయాలకు దీంతో అడ్డుకట్ట పడుతుందని మదుపర్లు భావిస్తున్నారు. దీనికితోడు ఆటో, మెటల్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు.. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలూ రాణించడమూ కలిసొచ్చింది. దీంతో సూచీల మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 84,456.75 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,391.27) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 84,906.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 426.86 పాయింట్ల లాభంతో 84,818.13 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.55 పాయింట్ల లాభంతో 25,898.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటెర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4222 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## అమెరికాతో వాణిజ్య చర్చలు..

### వాటికి భారత్ దూరంగా ఉండాలి : జీటీఆర్ఐ

భారత్– అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్చలపై తాజాగా మేథో సంస్థ జీటీఆర్ఐ (గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్) స్పందించింది. ఈ చర్చల్లో భారత్ వాణిజ్యంలో సమతుల్యం పాటించాలని, ముఖ్యంగా వ్యవసాయం, జన్యుమార్పిడి పంటల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తమకు భారత్ నుంచి అత్యుత్తమ ట్రేడ్ ఆఫర్స్ అందాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా జీటీఆర్ఐ స్పందించింది. 'యూఎస్‌తో జరుగుతున్న చర్చల్లో భారత్ వాణిజ్యంలో సమతుల్యతను పాటించాలి. ముఖ్యంగా వ్యవసాయ పంటలు, జన్యుమార్పిడి ఉత్పత్తులపై రాయితీలు ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. మనతో భాగస్వామ్యానికి యూఎస్ కట్టుబడి ఉంటే.. ముందుగా భారత ఎగుమతులపై విధించిన టారిఫ్‌లను 50 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలి' అని పేర్కొంది. ఇక, భారత ప్రతిపాదనల్లో అమెరికా అందుకున్న వాటిల్లో అత్యుత్తమమైనవి అంటూ గ్రీర్ చేసిన వ్యాఖ్యలు అంగీకరించడం కష్టం అని జీటీఆర్ఐ పేర్కొంది. మలేసియా వంటి దేశాలు యూఎస్‌తో వాణిజ్యఒప్పందం కోసం తమ ప్రధాన విధానాల విషయంలో కూడా రాజీపడాల్సి వచ్చిందని గుర్తుచేసింది. ఈ చర్చల్లో ఒప్పందంపై మాత్రమే దృష్టిపెట్టకుండా.. సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. ఈ క్రమంలో ట్రంప్ సుంకాలు విధించే అధికారంపై అమెరికా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ తీర్పు వెలువడేవరకు.. కొనసాగుతున్న చర్చల్లో భారత్ ఎలాంటి హామీలు ఇవ్వకుండా ఉండటమే మంచిదని సూచించింది. వచ్చే తీర్పు చర్చల్లో కీలక మలుపుగా మారొచ్చని అభిప్రాయపడింది.

# భారత్‌తో రెండో టీ20

## దక్షిణాఫ్రికా చేతిలో టీమ్‌ఇండియాకు ఓటమి

**కెప్టెన్, వైస్ కెప్టెన్ మరోసారి విఫలమైన వేళ.. దక్షిణాఫ్రికా చేతిలో టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. తొలి మ్యాచ్‌లో ఎదురైన ఘోర పరాజయం నుంచి సఫారీ జట్టు పుంజుకొని విజయం సాధించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లూ 1-1తో సమంగా నిలిచాయి. మూడో టీ20 మ్యాచ్ ఆదివారం ధర్మశాల వేదికగా జరగనుంది.**



**ముల్లన్‌పూర్ :** ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 51 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నాలుగు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (90) అదరగొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనలో టీమ్‌ఇండియా 162 పరుగులకే ఆలౌటైంది. తిలక్ వర్మ (62) హాఫ్ సెంచరీ చేసినా.. ఆ పోరాటం సరిపోలేదు. జితేశ్ శర్మ (27), అక్షర్ పటేల్ (21), హార్దిక్ పాండ్య (20), అభిషేక్ శర్మ (17) మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా క్వింటన్ డికాక్ నిలిచాడు.

### ఆ ఇద్దరు మళ్లీ విఫలం

ప్రస్తుత సారథి సూర్యకుమార్ యాదవ్, డిప్యూటీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరోసారి బ్యాటింగ్‌లో చేతులెత్తేశారు. ఏమాత్రం ప్రభావం చూపించలేదు. తొలి మ్యాచ్‌లో మాదిరిగానే గిల్ మళ్లీ నిరాశపరిచాడు. ఈసారి తొలి బంతికే డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఇక బ్యాటింగ్ ఆర్డర్ మారిన సూర్యకుమార్ (4) కూడా విఫలం కావడం అభిమానులను బాధించింది. వన్‌డౌన్‌లో వచ్చిన అక్షర్ పటేల్ అనుకున్నంత వేగంగా పరుగులు రాబట్టలేకపోయాడు. తిలక్ వర్మ, హార్దిక్, జితేశ్ కాస్త దూకుడుగా ఆడటంతో భారత్ కనీసం ఈ మాత్రం (162 రన్స్) స్కోరునైనా చేయగలిగింది. ఎనిమిదో బ్యాటర్‌గా వచ్చిన శివమ్ దూబె (1) ప్రభావం చూపించలేదు. దక్షిణాఫ్రికా బౌలర్లలో బార్ట్‌మన్ 4, ఎంగిడి 2, యాన్సెన్ 2, సిపామ్లా 2 వికెట్లు పడగొట్టారు.



### డికాక్ దూకుడు..

దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ ఈ మ్యాచ్‌లో మాత్రం భారత బౌలర్లకు పెద్దగా అవకాశాలు ఇవ్వలేదు. బుమ్రా (0/45), అర్ష్‌దీప్ (0/54) బౌలింగ్‌లో డికాక్ దూకుడుగా ఆడాడు. టాప్ పేసర్లకు కనీసం ఒక్క వికెట్ కూడా దక్కకపోవడం గమనార్హం. పవర్ ప్లేలో రీజా హెండ్రిక్స్ (8)ను ఔట్ చేసిన వరుణ్ చక్రవర్తి భారత్‌కు తొలి బ్రేక్ అందించాడు. కానీ, కెప్టెన్ మార్‌క్రమ్‌తో కలిసి డికాక్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 83 పరుగులు జోడించారు. సెంచరీకి చేరువగా వచ్చిన డికాక్ రనౌట్ రూపంలో ఔటయ్యాడు. మార్‌క్రమ్‌ను వరుణ్ ఔట్ చేయగా.. డేవాల్డ్ బ్రెవిస్ (14)ను అక్షర్ పెవిలియన్‌కు చేర్చారు. కానీ, ఆఖర్లో ఫెర్రీరా (30), డేవిడ్ మిల్లర్ (20) వేగంగా పరుగులు రాబట్టారు. దీంతో దక్షిణాఫ్రికా 200 స్కోరు దాటేసింది. టీమ్‌ఇండియా బౌలర్లలో వరుణ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు.



## సూర్యకుమార్ యాదవ్‌కు అసలు ఏమైంది?

సూర్యకుమార్ యాదవ్ క్రీజులోకి వస్తే.. ప్రత్యర్థులకు ముఖ్యంగా బౌలర్లకు ముచ్చెమటలే. ఎంత మంచి బంతిని సంధించినా.. దాన్ని బౌండరీకి తరలించడం స్కై హాబీ. కానీ కొంతకాలంగా అతడి బ్యాటింగ్‌లో మెరుపు తగ్గుతోంది. ఇన్నింగ్స్‌లు గాడి తప్పుతున్నాయి. గత 19 టీ20 ఇన్నింగ్స్‌లో అతడు కేవలం 222 పరుగులు మాత్రమే చేశాడు. స్ట్రైక్ రేట్ కూడా 120కి పడిపోయింది. ఓవరాల్‌గా అతడి కెరీర్ స్ట్రైక్‌రేట్ 164.05గా ఉండటం గమనార్హం.

### ఒక్కటంటే.. ఒక్కటి కూడా..

ఈ 19 ఇన్నింగ్స్‌ల్లో అతడు 12 సార్లు మూడో స్థానంలో, 7 సార్లు నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. వీటిలో రెండంటే రెండు మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఉన్నాయి. పాకిస్థాన్ మీద చేసిన 47, ఆస్ట్రేలియాపై సాధించిన 39 పరుగులు తప్ప.. ఇక చెప్పుకోవడానికి ఇంకేమీ లేదు. అయితే వీటిలో కనీసం ఒక్కటంటే ఒక్క హాఫ్‌సెంచరీ కూడా లేదు. మంగళవారం కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20లోనూ కేవలం 12 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు.

### బ్యాటింగ్ ఆర్డర్ మారినందుకా..?

సూర్యకుమార్ సాధారణంగా మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. కానీ ఈ మధ్య కొన్నిసార్లు బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. అవి కూడా సూర్యకుమార్ ప్రదర్శన మీద ప్రభావం చూపుతున్నాయని అభిమానులు, క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేశాడు. 'సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన బ్యాటర్. అతడో మ్యాచ్ విన్నర్. అలాంటి ఆటగాడు తమ జట్టులో ఉండాలని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. అయితే అతడు బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు వెళ్లడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నా దృష్టిలో అతడు నం.3లో బ్యాటింగ్‌కు రావాలి. బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయొద్దు' అని ఉతప్ప విశ్లేషించాడు.

### వీలైనంత త్వరగా..

ప్రతిష్ఠాత్మకమైన టీ20 వరల్డ్‌కప్ 2026కు ఫిబ్రవరిలోనే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్ వరుస వైఫల్యాలు టీమ్‌ఇండియాను ఇబ్బంది పెడుతున్నాయి. అలాగే వరల్డ్ కప్‌నకు ముందు టీమ్‌ఇండియా ఆడాల్సిన మ్యాచ్‌లు కూడా చాలా తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్ తర్వాత.. భారత జట్టు న్యూజిలాండ్‌తో అయిదు టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడనుంది. అందుకే సూర్యకుమార్ యాదవ్ వీలైనంత త్వరగా తన రిథమ్‌లోకి వచ్చి, పూర్వపు ఫామ్‌ను అందుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.



## రోహిత్ భయ్యా ప్రేమతో తిడతాడు

**దిల్లీ:** జూనియర్ ఆటగాళ్లను రోహిత్ శర్మ ప్రేమతో తిడతాడని టీమ్‌ఇండియా ఆటగాడు యశస్వి జైస్వాల్ అన్నాడు. "రోహిత్ భయ్యా మమ్మల్ని ఎప్పుడు తిట్టినా.. ప్రేమతో తిడతాడు. అందులో చనువు ఉంటుంది. భయ్యా ఒకవేళ తిట్టకపోతే ఏదో అసౌకర్యంగా ఉంటుంది. ఏం జరిగి ఉంటుంది? ఎందుకు తిట్టట్లేదు అని అనుకుంటా. నా మీద ఏమైనా చెడు భావన కలిగిందా అని అనిపిస్తుంది" అని ఓ సదస్సులో జైస్వాల్ చెప్పాడు. రోహిత్, కోహ్లి జట్టులో ఉంటే తమకు ప్రేరణగా ఉంటుందని అతడు పేర్కొన్నాడు. "వాళ్లు జట్టులో ఉండడం మాకు మేలు చేస్తుంది. ఆట గురించి చర్చిస్తారు. అనుభవాలను మాతో పంచుకుంటారు. ఆ ఆటగాళ్లు మాకు ప్రేరణ. ఆ ఇద్దరు తాము కెరీర్ మొదట్లో చేసిన తప్పుల గురించి వివరించి, మేము అలాంటి తప్పులు చేయకుండా ఎలా ఉండాలో చెబుతారు. వాళ్లు లేనప్పుడు వెలితిగా అనిపిస్తుంది. ఆ ఇద్దరు ఉంటే చాలా ప్రశాంతంగా ఉంటుంది" అని జైస్వాల్ చెప్పాడు. అవకాశమొస్తే భారత జట్టుకు నాయకత్వం వహిస్తానని అతడు అన్నాడు. రోహిత్, కోహ్లి వన్డే ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

## గౌతమ్ గంభీర్..

# రో-కోకు క్రెడిట్ ఇవ్వలేదు


### రాబిన్ ఉతప్ప




దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్‌సిరీస్‌ను 2-0 తేడాతో కోల్పోయి, టీమ్‌ఇండియా వైట్‌వాష్‌కు గురైన విషయం తెలిసిందే. అయింతే భారత జట్టు వన్డేల్లో తన సత్తా చాటింది. ఈ సిరీస్‌ను టీమ్‌ఇండియా 2-1 తేడాతో కైవసం చేసుకుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి బ్యాటింగ్‌లో రాణించారు. ముఖ్యంగా కోహ్లి.. రాంచీ, రాయ్‌పుర్ వన్డేల్లో వరుస సెంచరీలు, విశాఖపట్నంలో అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగిపోయాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అతడు ఏకంగా 302 పరుగులు సాధించి, టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరోవైపు రోహిత్ శర్మ రాంచీలో (57), విశాఖపట్నంలో (75) హాఫ్‌సెంచరీలతో రాణించాడు. రాయ్‌పుర్ వన్డేలో మాత్రం 14 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా 146 రన్స్ సాధించాడు. ఇలా వీరిద్దరూ టీమ్‌ఇండియా వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించారు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ తన మొదటిస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. విరాట్ కోహ్లి రెండో స్థానానికి దూసుకొచ్చాడు. అయితే.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి గురించి భారత జట్టు హెడ్‌కోచ్ గౌతమ్‌గంభీర్ .. సిరీస్ విజయం తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించలేదని, టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప విమర్శించాడు. వారికి క్రెడిట్ ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు. 'టీమ్‌ఇండియా వన్డే సిరీస్ విజయం సాధించిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లికి క్రెడిట్ ఇవ్వడాన్ని నేను గమనించలేదు. రో-కో ద్వయం తమ ఫామ్‌పై వస్తున్న సందేహాలకు తమ ప్రదర్శనతో చెక్ పెట్టారు. తమ బ్యాటింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించారు. తాము ఫామ్‌లో ఉంటే.. టీమ్‌ఇండియా కోసం ఏం చేయగలరో.. చేసి చూపించారు' అని రాబిన్ ఉతప్ప తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్‌కు తమ వీడ్కోలు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారు కేవలం వన్డే మ్యాచుల్లోనే టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వన్డే వరల్డ్‌కప్ 2027లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. రోహిత్ శర్మ దాదాపు 10 కిలోల బరువు తగ్గి, స్లిమ్‌గానూ ఫిట్‌గానూ తయారయ్యాడు. ఇక విరాట్ కోహ్లి ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు.

# చిన్మయి మార్ఫింగ్ ఫోటోతో ట్రోల్


## గట్టిగా రిప్లై ఇస్తూనే.. పోలీసులకు ఫిర్యాదు





సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దాడులకు సింగర్ చిన్మయి శ్రీపాద మరోసారి గట్టి సమాధానం ఇచ్చారు. మహిళల హక్కులు, భద్రత వంటి అంశాలపై గళమెత్తే చిన్మయి తరచూ ట్రోలింగ్‌కు గురయ్యే విషయం తెలిసిందే. అయితే ప్రతిసారి ధైర్యంగా స్పందిస్తూ, ట్రోలర్లను ఎదుర్కొనే తీరుతో ఆమె పలుమార్లు ప్రశంసలు పొందారు. తాజాగా ఆమెపై మార్ఫింగ్ ఫోటోలతో దాడి చేసిన వ్యక్తులపై చిన్మయి ఘాటుగా స్పందించి వీడియోను షేర్ చేశారు. చిన్మయి తన మార్ఫింగ్ చేసిన ఫోటోను, దాన్ని షేర్ చేసిన అకౌంట్ స్క్రీన్‌షాట్‌ను పోస్ట్ చేస్తూ, వెంటనే పోలీసులకు కంప్లయింట్ చేసినట్లు తెలిపారు. గత 8–10 వారాలుగా కొంతమంది డబ్బులు తీసుకుని తనను, తన కుటుంబాన్ని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వీడియోలో పేర్కొన్నారు. ఈరోజు నాకు మార్ఫ్ చేసిన ఫోటో పంపించారు. వెంటనే పోలీసులకు ట్యాగ్ చేశాను. చట్టపరమైన చర్యలు తీసుకుంటారో లేదో ముఖ్యం కాదు. కానీ ఇలాంటి వ్యక్తులు అమ్మాయిలను, వారి కుటుంబాలను వేధించకుండా ఉండేందుకు ఈ వీడియో చేస్తున్నాను' అని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ రిలీజ్ సమయంలో చిన్మయి, ఆమె భర్త రాహుల్ రవీంద్రన్‌పై నెటిజన్లు తీవ్ర విమర్శలు, అసభ్య కామెంట్లు చేశారు. రాహుల్ ..మంగళసూత్రం గురించి మాట్లాడిన పాత వీడియోను బయటకు తీసి, దారుణమైన పదజాలంతో దూషించారు. ఈ సందర్భంలో చిన్మయి మహిళల భద్రతపై వ్యాఖ్యానించడంతో మరింతగా ట్రోలింగ్ జరిగింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కు ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇప్పుడు షేర్ చేసిన తాజా వీడియోలో కూడా చిన్మయి కొంతమంది నెటిజన్ల పేర్లు ప్రస్తావిస్తూ, 'పుట్టిన పిల్లలు చనిపోవాలని కోరుకునే ఇటువంటి అబ్బాయిలకు అమ్మాయిలను ఇచ్చి పెళ్లి చేయాలా?' అంటూ ప్రశ్నించారు. మార్ఫింగ్ ఫోటోలు వచ్చినప్పుడు భయపడకుండా, వెంటనే తమ కుటుంబ సభ్యులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయాలని మహిళలకు సూచించారు. చిన్మయి షేర్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# దురంధర్‌పై హృతిక్ ప్రశంసలు



ఇటీవల విడుదలైన ధురంధర్ ప్రశంసలు అందుకుంటుంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు ఈ చిత్రంపై రివ్యూ ఇవ్వగా తాజాగా హృతిక్ రోషన్ దీని గురించి మాట్లాడారు. అయితే, ఆయన వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తప్పుపడుతున్నారు. సినిమా చాలా బాగుందన్న హృతిక్ ఇందులో చూపించిన రాజకీయ అంశాలను తాను అంగీకరించనని అన్నారు. నాకు ఈ చిత్రం చాలా నచ్చింది. ఇంత గొప్ప కథను ప్రేక్షకులకు అందించినందుకు చిత్ర బృందానికి అభినందనలు. హృదయానికి హత్తుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. కథను తెరకెక్కించిన విధానం మెప్పించింది. సినిమా అంటే ఇలా ఉ ండాలి అనిపించింది. ఇందులో చూపించిన రాజకీయపరమైన అంశాలను నేను అంగీకరించలేకపోతున్నా. కానీ, దర్శకులు కొన్ని విషయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి కాబట్టి అలా రూపొందించారని నేను భావిస్తున్నా. నేను ఈ చిత్రాన్ని ఆస్వాదించాను. దీనినుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని హృతిక్ అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ విమర్శలకు దారితీస్తున్నాయి. ధురంధర్‌లో కేవలం పాకిస్థాన్ ఉగ్రవాదుల క్రూరత్వాన్ని చూపారని, వారి భయంకరమైన దాడులను చూపారని ఆ విషయాలను ఎందుకు అంగీకరించలేక పోతున్నారని నటుడిపై విమర్శలు కురిపిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్, మాధవన్, సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా మరోవైపు కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ యాక్షన్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రూ. 180 కోట్లు వసూలు చేసింది. ఈ వారంలో రూ. 200 కోట్లు వసూలు చేయవచ్చని అభిమానులు భావిస్తున్నారు.

# యు సో క్యూట్



మలయాళ కుట్టీ అనుపమ పరమేశ్వరన్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'ప్రేమమ్' మూవీతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నది తన ఫస్ట్ మూవీతోనే మంచి ఫేమ్ తెచ్చుకుంది. ఆ తర్వాత 'ఆ ఆ', 'శతమానం భవతి', 'హలో గురు ప్రేమ కోసమే', 'రాక్షసుడు', 'కార్తికేయ 2' వంటి హిట్ సినిమాల ద్వారా మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక చివరిగా 'బైసన్' మూవీతో ప్రేక్షకులను అలరించిన ఈ చిన్నది.. ప్రజెంట్ 'లాక్ డౌన్' సినిమాలో నటిస్తోంది. ఇదిలా ఉంటే.. ఈ చిన్నది నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. లేటెస్ట్ ఫొటో షూట్స్, సినిమాలకు సంబంధించిన విషయాలను ఫ్యాన్స్‌తో షేర్ చేస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా అనుపమ తన ఇన్‌స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. అందులో పర్పుల్ కలర్ శారీలో స్లీవ్ లెస్ జాకెట్‌లో చాలా అందంగా కనిపించింది. బ్లాక్ బొట్టు, పెద్ద పెద్ద సిల్వర కలర్ బుట్టాలు, హెయిర్‌ను బన్‌లా చేసుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పిక్స్ నెట్టింట వైరల్‌గా మారగా.. వీటిని చూసిన నెటిజన్లు సో క్యూట్, చీరలో కత్తిలా ఉ న్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.



# జిమ్‌కు ఆ దుస్తుల్లోనే వెళ్లాలి

## ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన ప్రగతి

ఇటీవల జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తాను సాధించిన నాలుగు పతకాలను ఇండస్ట్రీలోని మహిళా ఆర్టిస్టులకు అంకితం చేస్తున్నట్లు నటి ప్రగతి చెప్పారు. తాను మీడియాకు కొంచెం దూరంగా ఉంటానని.. ఎక్కడ ట్రోల్ చేస్తారోననే భయంతోనే దూరంగా ఉంటున్నట్లు ప్రగతి తెలిపారు. ఇటీవల తాను పవర్ లిఫ్టింగ్ కోసం ప్రాక్టీస్ చేసే సమయంలో వచ్చిన ట్రోల్స్ గురించి ఆమె తాజాగా జరిగిన '3 రోజెస్' ట్రైలర్ లాంఛ్ ఈవెంట్లో మాట్లాడారు. "నేను సినిమాలు మానేసి పవర్ లిఫ్టింగ్ చేస్తున్నానని అందరూ అన్నారు. నేను సినిమాలు ఎప్పటికీ మానలేను. ఎందుకంటే నటించకపోతే నేను బతకలేను. నాకు ఇంత గుర్తింపు రావడానికి, నేను అన్నం తినడానికి కారణం ఇండస్ట్రీనే. అందుకే దాన్ని ఎప్పటికీ వదిలిపెట్టను. తుదిశ్వాస వరకూ యాక్టింగ్ చేస్తూనే ఉంటాను. సెట్‌లోనే కన్నుమూయాలని కోరుకుంటా" "సరదాగా పవర్ లిఫ్టింగ్ ప్రారంభించి.. పతకాలు సాధించాను. నేను దాన్ని ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు చాలామంది ట్రోల్ చేశారు. 'నీకు ఈ వయసులో అవసరమా' అన్నారు. జిమ్‌లో నా దుస్తులపై కూడా విమర్శలు కురిపించారు. జిమ్‌కు అలాంటి దుస్తుల్లోనే వెళ్లాలి. చీర కట్టుకుని లేదంటే చుడీదార్‌లోనో నేను జిమ్ చేయలేను. ఆ ట్రోల్స్ చూసి నేను తప్పు చేస్తున్నానేమోనని భయపడ్డాను. ఎదిగిన కూతురు ఉంది. నా వల్ల తనకు ఏమైనా ఇబ్బంది కలుగుతుందేమోనని బాధ పడ్డాను. కానీ, ధైర్యంగా ముందుకు వెళ్లాను. నన్ను ట్రోల్ చేసిన వారికి నా పతకాలతో సమాధానం ఇచ్చాను. వీటిని నేను ఇండస్ట్రీలో ఉన్న మహిళలకు అంకితం చేస్తున్నా. ఎందుకంటే ఇండస్ట్రీలో కొనసాగాలంటే ఎంత కష్టమో నాకు తెలుసు. మీరు మాకు ఏమిచ్చినా, ఇవ్వకపోయినా.. కొంచెం మర్యాద ఇవ్వండి" అని ట్రోలర్స్‌ను ఉద్దేశించి ప్రగతి మాట్లాడారు.


# ఓటిటిలోకి వచ్చేసిన '12ఏ రైల్వే కాలనీ'




అల్లరి నరేష్ నటించిన '12ఏ రైల్వే కాలనీ' సినిమా నవంబర్ 21న థియేటర్లలో విడుదలై పెద్దగా ఆడియన్స్‌ను ఆకట్టుకోలేకపోయింది. సూపర్ నేచురల్ థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకున్న నరేష్ ఈ సినిమా ద్వారా విభిన్నమైన ప్రయోగం చేశాడు. నాని కసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటించగా, కథను ప్రముఖ రచయిత, దర్శకుడు పొలిమేర అందించారు. టీజర్, ట్రైలర్ విడుదలైనప్పుడు ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అల్లరి నరేష్ కామెడీ హీరో ఇమేజ్ నుంచి బయటకు వచ్చి సీరియస్ హారర్ జానర్‌లో అడుగుపెడుతుండటం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే సినిమా రిలీజ్ అయిన తర్వాత మాత్రం మిశ్రమ స్పందన వచ్చింది. కథనం రొటీన్‌గా ఉందని, హారర్ ఎలిమెంట్స్ కూడా పెద్దగా కనెక్ట్ కాలేదని ప్రేక్షకులు పేర్కొన్నారు. దీంతో చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపడంలో విఫలమైంది. బాక్సాఫీస్ కలెక్షన్లు ఆశించిన స్థాయికి చేరకపోవడంతో మేకర్స్ పెద్దగా గ్యాప్ లేకుండా ఈ సినిమాను ఓటిటీలోకి తీసుకువచ్చారు. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమాకు ఓటిటీ హక్కులు దక్కించుకుంది.

# చిరుతలో రామ్‌చరణ్‌లా ఉన్న రోషన్ కనకాల

## మోగ్లీ ప్రీ రిలీజ్ వేడుకల్లో నటుడు రానా కితాబు






రోషన్ కనకాలను చూస్తుంటే తనకు 'చిరుత'లో రామ్ చరణ్‌ను చూసినట్లు ఉందని నటుడు రానా అన్నారు. రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మోగ్లీ 2025'. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. డిసెంబర్ 13న విడుదల కానుంది. తాజాగా ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఆ వేడుకకు రానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదిలావుంటే రానా, విష్ణు విశాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అడవి, ఏనుగుల రక్షణ కోసం పాటుపడే వ్యక్తిగా రానా నటించారు. తాజాగా రానా ఆ సినిమా షూటింగ్ రోజులను గుర్తుచేసు కున్నారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశంలోకి ఏనుగుల గుంపు వచ్చిందని చెప్పారు. అరణ్య షూటింగ్ కోసం ఆరు నెలలు అడవిలో ఉన్నాం. మేము కొన్ని సన్నివేశాలను ఏనుగులు ఉండే ప్రాంతంలో చేశాం. సాయంత్రం సమయానికి వెళ్లిపోవాలి అన్నారు. అనుకున్న టైమ్‌కు మన షూటింగ్‌లు ఎప్పుడూ ముగించరని అందరికీ తెలిసిందే. దీంతో రాత్రి వరకూ అక్కడే ఉన్నాం. నేను సన్నివేశంలో భాగంగా దూరంగా ఉన్నాను. సడన్‌గా అందరూ గబగబా వెళ్లిపోతున్నారు. ఎందుకు ఇలా పరిగెడుతున్నారు అని చూసేసరికి ఏనుగులు మా వైపునకు వస్తున్నాయి. దీంతో నేను, మరికొంతమంది వాటికి కనిపించకుండా చెట్ల చాటుకు వెళ్లాం. కొంచెం కూడా శబ్దం చేయకుండా అలానే మూడు గంటలు ఉ న్నాం. ఆ చిమ్మచీకట్లో అలా మూడు గంటలు ఉండడం ఎప్పటికీ మర్చిపోలేను. అడవి ఎంత భయంకరంగా ఉంటుందో మొదటిసారి అప్పుడే అర్థమైంది అని రానా ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. 'నేనే రాజు.. నేనే మంత్రి' తర్వాత రానా నటించిన సినిమా 'అరణ్య'. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత విడుదలైన తొలి పాన్ ఇండియా చిత్రం కూడా ఇదే. ఇందులో రానా ఫారెస్ట్ మేన్‌గా నటించారు. సందేశాత్మక చిత్రంగా ఆకట్టుకుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com